నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
మంగళవారం | 10 సెప్టెంబరు 2024 | www.navatelangana.com

డివైడర్ మధ్యలో నిలిచిపోయిన భారీ వాహనం

రాజీవ్ రహదారి ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్



నవతెలంగాణ-కొండపాక

భారీ వాహనం దుద్దెడ శివారులో యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ మధ్యలో నిలిచిపోయింది. దాంతో రాజీవ్ రహదారిపై ఇరు ప్రక్కల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న భారీ లారీ బందారం వెళ్లేందుకు దుద్దెడ దాటిన తర్వాత యూటర్న్ తీసుకుంటుండగా డివైడర్ పైకి వెళ్లి టైర్లు ఇరుక్కపోయి నిలిచిపోయింది. దాంతో రెండు వైపులా రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిచిపోవడంతో రాజీవ్ రహదారిపై వెళ్తున్న ఇరువైపుల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సుమారు అరగంట పాటు రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. టోల్ ప్లాజా వారికి సమాచారం ఇవ్వడంతో కంటైనర్ తెచ్చి రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించారు.

పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా



నవతెలంగాణ-సంగారెడ్డి

పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఇది చెంపపెట్టు లాంటిద న్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అడ్డదారుల్లో ఎమ్మెల్యేలను చేర్చుకోవాలనుకునే బుద్ధి దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య సూత్రాలను కాలరాస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా ఫిరాయింపులను ప్రోత్సహించిన సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టు ఆదేశాలకనుగుణంగా వ్యవహరించి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఇకనైనా స్పీకర్ రాజ్యాంగం పదో షెడ్యూల్ కనుగుణంగా.. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేయాలన్నారు. ప్రజా పాలన అసలురంగేందో 9 నెలల కాలంలోనే బయటపడిందన్నారు. అనర్హత వేటు వేసిన స్థానాల్లో ఎన్నికలు జరగడం ఖాయమని, బీఆర్ఎస్ గెలవడం ఖాయమన్నారు.

సిద్దిపేట, వరంగల్ మాదిరిగా

'సంగారెడ్డి' అభివృద్ధి చెందాలి



- సంగారెడ్డి పట్టణం పూర్తిస్థాయి అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహా
- పట్టణాభివృద్ధి పై మంత్రి సమీక్ష

నవతెలంగాణ-సంగారెడ్డి

సిద్దిపేట, వరంగల్ పట్టణాల మాదిరిగా 'సంగారెడ్డి' అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సమావేశమందిరంలో అదన పు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిపి సంగారెడ్డి పట్టణ అభివృద్ధి పై ఆర్అండ్‌బి, మున్సిపల్, ఇరిగేషన్, ట్రాన్స్కో తదితర శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న సంగారెడ్డి పట్టణం గత పదేండ్లలో అభివృద్ధిలో వెనుకబడి పోయిందన్నారు. సంగారెడ్డి పట్టణం, సిద్దిపేట, వరంగల్, సిరిసిల్ల పట్టణాల్లాగా ఎందుకు అభివృద్ధి చెందలేదని అధికా రులను ప్రశ్నించారు. సంగారెడ్డి పట్టణం వరంగల్ సిద్దిపేటలాగా అభివృద్ధి చెందేలా అధికారులు అవసరమైన ప్రణాళి కలు రూపొందించాలని ఆదేశించారు. పట్టణంలో బటర్ ఫ్లై లైట్లు పార్కులో ఏర్పాటు, పట్టణ సుందరీ కరణ, చెరువుల అభివృద్ధి, మినీ ట్యాంక్‌బండ్‌ల ఏర్పాటు తదితర అభివృద్ధి చెందేలా ప్రణాళికల రూపొందించాలన్నారు. ఆర్అండ్‌బి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై బటర్ ఫ్లై, ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వాటి నిర్వహణను మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించడం కోసం మున్సిపల్ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. వర్షాలు భారీ వరదల వల్ల లోతట్టు ప్రాంతాలు మునిగిపోకుండా ఉండే దుకు నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు చేపట్టాల న్నారు. పట్టణం పరిధిలోని చెరువులో కుంటలు గుర్తించి వాటి ఎఫ్‌టిఎల్‌లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాల న్నారు. వరద నీరు నిల్వ ఉండకుండా వెంటనే వెళ్లిపోయేలా చెరువులు కుంటల్లో ఉన్న వరద కాలువలకు అవసరమైన మనుమతి పనులు చేపట్టి వరద కాలువలు, నాలాల పూడిక తీత పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తూముల నుండి నీరు పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ జిల్లాలోని వివిధ శాఖల అధికారుల తో పాటు, సంగారెడ్డి మాజీ శాసన సభ్యులు జగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్



నవ తెలంగాణ-దుబ్బాక

భారీ వర్షాలతో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ఖమ్మం వరద బాధితులకు అండగా నిలుద్దామని సీఐటీయూ సిద్దిపేట జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ కోరారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయం కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత 15 రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వలన ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో వేలాది కుటుంబాలు నిరాశ్రయలైనాయని, వాటితో పాటు పంటలకు తీవ్రంగా నష్టం జరిగి ప్రజలు కోలుకోలేని స్థితికి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలను ఆదుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దుబ్బాక ప్రాంతంలోని వ్యాపారస్తులు, శ్రేయోభిలాషులు తమ వంతు సహాయ సహకారాలు అందించారని వారందరికి ధన్యవాదాలు తెలిపారు. అందించిన విరాళాలను వెంటనే రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, నాయకులు రాజు, మహేష్, అజయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ...ఒకరు మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

కారు బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పాపన్న పేట మండల పరిధిలోని ఎల్లాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్, కుటుంబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని చౌట్లపల్లి గ్రామానికి చీమల గణేష్ (28) ప్రైవేటు వాచ్ మెన్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మీ నగర్ ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద వాచ్ మెన్ విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో ఏడుపాయల కమాన్ వైపు నుంచి మెదక్ వెళుతున్న కారు ఎల్లాపూర్ శివారులో ఎదురుగా ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న గణేష్ కింద పడి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్దయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

మద్యం మత్తులో... వృద్ధుడి దారుణ హత్య

నిందితుల వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ - తూప్రాన్

మద్యం మత్తులో భిక్షాటన చేసే గుర్తుతెలియని ఓ వృద్ధుడిని ఇద్దరు యువకులు ధారుణంగా కొట్టి హత్య చేసినట్లు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం తూప్రాన్ సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో గత వారం రోజులుగా బిక్షాటన చేస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 4వ తేదీన రాత్రి బస్టాండులో పడుకొన్నాడు. గోమారం గ్రామానికి చెందిన మణికంఠ గౌడ్, తిరుపతి రెడ్డిలు మద్యం మత్తులో ఆ వృద్ధుడిని తీవ్రంగా కొట్టి హత్య చేశారు. గత నాలుగు రోజుల క్రితం అనుమానస్పదంగా కేసు నమోదు చేసిన పోలీసులు గ్రామంలోని సీసీ ఫుటేజ్ ఆధారంగా, గ్రామస్తుల సమాచారం మేరకు ఇద్దరు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగ కృష్ణ, ఎస్సైలు శివానంద్, మహిపాల్ రెడ్డి, సుభాష్ గౌడ్, చైతన్య రెడ్డి, రాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాల నుంచి ప్రజలను కాపాడడం అధికారుల బాధ్యత



నవతెలంగాణ-హత్నూర

ప్రజలను విషజ్వరాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గందగల్ల ప్రసాద్ మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎక్కడ పడితే అక్కడ నీళ్లు నిలిచాయన్నారు. దాంతో దోమలు ప్రబలి అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మండ లంలోని కొన్యాల గ్రామానికి చెందిన ఓ మహిళ రెండ్రోజుల క్రితం మలేరియాతో మృతి చెందిందని.. అలాగే నిఖిల్ అనే రెండు నెలల చిన్నారి కూడా డెంగ్యూ చనిపోయాడన్నారు. దాంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. భారీ వర్షాలకు గ్రామంలో చెత్తా చెదారం పేరుక పోయిందన్నారు. దాంతో ఎప్పుడు ఏ అనారోగ్య సమస్యలు వస్తాయో అని ప్రజలు ఆందోళన పడుతు న్నారన్నారు. అంతే కాకుండా ఈ గ్రామంలోని ప్రైమరీ హైస్కూల్‌కు కొన్యాల, మదారం, చిక్‌మద్దూరు గ్రామాల నుంచి సుమారు నాలుగు వందలమంది విద్యార్థులు చదువుకోడానికి వస్తుం టారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు స్కూల్ ఆవరణంలో మురుగు చేరిందని.. అలాగే గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయన్నారు. దాంతో ఈగలు, దోమలు ప్రబలి విద్యార్థుల తోపాటు ఉపాధ్యాయులు కూడా నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

నీట మునిగిన పంట వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం



నవతెలంగాణ-మునిపల్లి : భారీగా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంట నీట మునిగిందని.. నీట మునిగిన పంటలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జోగిపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, ఏడీఏ సత్యనారాయణలు అన్నారు. మండలంలోని తాటిపల్లి, అంతారం, పిల్లోడి గ్రామాల్లో నీట మునిగిన పత్తి పంటను వారు క్షేత్రస్థాయి పర్యటన చేసి సోమవారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట మునిగిన పంటల్లోని వర్షపు నీటిని ముందుగా తొలగించాలని రైతులకు సూచించారు. అలాగే ఏదైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించి వారి సూచనల, సలహాల మేరకు మందులు పిచికారి చేయాల న్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సారిక, శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు, రైతులు మైపాల్ రెడ్డి,సతీష్‌లు ఉన్నారు.

ముంపు బాధితులకు అండగా ప్రభుత్వం

- భవిష్యత్తులో వరదనీరు ఇండ్లలోకి చేరకుండా చర్యలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహా
- సంగారెడ్డి రెవెన్యూ కాలనీ, శ్రీ చక్ర కాలనీల్లో పర్యటన



నవతెలంగాణ-సంగారెడ్డి

భారీ వర్షాల వల్ల ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని.. భవిష్యత్‌లో వరదనీరు ఇండ్లల్లోకి చేరకుండా చర్యలు చేపడుతామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. వరద నీటితో ముంపునకు గురైన సంగారెడ్డి పట్టణంలోని రెవెన్యూ కాలనీ, శ్రీ చక్ర కాలనీలను మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. పట్టణానికి అనుకుని ఉన్న ఎర్రకుంట, చంద్రయ్య కుంటల్లో వరద కాలువలు పూడుకు పోవడం, ఎర్రకుంట తూము చిన్నగా ఉండడంతో వరద నీరు బయటకు వెళ్లలేక, రెవెన్యూ కాలనీ, శ్రీ చక్ర కాలనీలలోకి వచ్చింది. దీంతో రెండు కాలనీల్లో సుమారు 130 ఇండ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. దాంతో ఆ ప్రాంతాలను మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు పరిశీలించారు. భవిష్యత్తులో ఇండ్లలోకి ఇలా వరద నీరు రాకుండా ఉండడం కోసం ఎర్రకుంట, చంద్రయ్య కుంటల వరద కాలువలు పూడిక తీయడంతో పాటు తూములు వెడల్పు చేసి ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు చేపట్టాలని నీటి పారుదల శాఖ మున్సిపల్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలతో మంత్రి మాట్లాడారు. ప్రజలు అధైర్య పడద్దని ప్రభుత్వం ముంపు బాధితులకు అండగా ఉంటుందని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్ట నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు తోపాజి అనంత కిషన్, బొంగుల రవి, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



నవతెలంగాణ-సంగారెడ్డి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ఎం. సురేష్ అన్నారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, గురుకుల హాస్టళ్ల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని.. కాస్మోటిక్ చార్జీలను పెంచి సొంత భవనాలను కట్టించాలని.. పెండింగ్ స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కాగా ధర్నాలో పాల్గొన్న వారిని పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎం.సురేష్ మాట్లాడుతూ.. గురుకులాలకు పక్కా భవనం లేకపోవడంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు చదువుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఈ ఎనిమిది నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో 36 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. సుమారు 500 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు లోనై హాస్పిటల్ పాలయ్యారన్నారు. ప్రభుత్వం విద్యార్థుల పర్యవేక్షణ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా అద్దె భవనంలోనే కొనసాగిస్తూ అరకొర వసతులు కల్పించడంతో గురుకులాల్లో చేరే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. అటు ఇంటికి వెళ్లి చదువుకోలేక ఇటు గురుకులంలో ఉండలేక అడ్మిషన్ పొంది ఇంటి దగ్గరే ఉంటూ డ్రాపౌట్లుగా మారే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు సరిపోయే నిధులు కేటాయించి పక్కా భవనాలను నిర్మించి, ఆరోగ్యకరమైన భోజనానికితగిన నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాల చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప, డివిజన్ నాయకులు సిద్దు, అనిల్, బన్నీ, స్వాత్విక, మల్లేశ్వరి, వాసు పప్పి, సౌజన్య, హారిక, నవ్య శిరీష పాల్గొన్నారు.

ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి



నవతెలంగాణ-కొండాపూర్

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే.రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోనినీ మునిదేవునిపల్లి గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి, మొక్కజొన్న, కంది తదితర కూరగాయల పంటలు నీటిలో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక ఎకరాకు రూ.50 వేల నష్టం జరిగిందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కండ్ల ఎదుటనే నీటిలో మునిగిపోవడం విచారకరమన్నారు. రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు వెంటనే నీట మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 25,000 నష్టపరిహారం చెల్లించి, బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, రబీ సీజన్లో పంటలు వేసుకు నేందుకు ఉచితంగా ఎరువులు,విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా అంటువ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు నాయకులు బాబూరావు, గోపాల్ నర్సింలు రైతులు మానేయ శీను చంద్రయ్య శివలింగం పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జన జయప్రదం చేయాలి



నవతెలంగాణ జహీరాబాద్

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 25న నిర్వహించే ఎస్ఎఫ్ఐ విద్యార్థి మహాగర్జనను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజేష్ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జహీరాబాద్ డిగ్రీ కళాశాల కమిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు, కెజీబీవిలు, గురుకులాల్లో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరితే.. వేధింపులకు గురి చేస్తున్న టీచర్స్ పై చర్యలు తీసుకోవాలన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న నడుస్తున్న గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు స్వంత భవనాలు నిర్మించాలన్నారు. గత ఆరేండ్ల నుంచి రాష్ట్రంలో పెండింగ్ ఉన్న రూ.8000 కోట్ల పైగా స్కాలర్‌షిప్స్, ఫీజురీయంబర్స్ విడుదల చేయాలన్నారు. రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని.. యూనివర్శిటీలను అభివృద్ధి చేసి, తక్షణమే వైస్-ఛాన్సలర్స్‌ను నియమించాలన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి జరిగే మహాధర్నాలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు హరీష్ , విష్ణువర్ధన్ నాయకులు సురేష్ , లక్ష్మణ్ , పృథ్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సాయుధ పోరాట వారోత్సవాల బుక్లెట్ విడుదల



నవతెలంగాణ-సంగారెడ్డి

సెప్టెంబర్ 10 నుంచి17 వరకు జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మల్లిఖార్జున్, జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో వారోత్సవాల బుక్లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్, జయరాజు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెల్లో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ మతతరంగు పులిమి రాజకీయం చేస్తోందన్నారు. నాటి స్వాతంత్ర్య సాయుధ రైతాంగ పోరాటలను గుర్తు చేయాల్సిన పాలకు వాటిని రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేసారని గుర్తు చేశారు. పాలకుల దోపిడీని అరికట్టేందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య మానిక్, ఆఫీస్ సెక్రటరీ కృష్ణ తది తరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న వక్ఫ్, ఎండోమెంట్ సవరణ బిల్లును తక్షణమే విరమించుకోవాలని ముస్లిం యాక్షన్ కమిటీ చైర్మెన్ మహమ్మద్ యూసుఫ్ అన్నారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఎండోమెంట్ సవరణ బిల్లు-2024ను ముస్లిం సంఘాలతో పాటు వివిధ వర్గాలకు చెందిన సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయన్నారు. భారత లౌకిక సంప్రదాయం చెక్కుచెదరకుండా ఉండేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారతీయ ముస్లింలకు వ్యతిరేకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న తన అజెండాలోని భాగమే ఎండోమెంట్ బిల్లు అన్నారు. ఈ సవరణ బేషరతుగా విరమించుకోవాలన్నారు. యువత తమ స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా సోషల్ మీడియాలో ఈ బిల్లు గురించి ప్రతీ ఒక్కరికీ తెలిసేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముహమ్మద్ ముయిజుద్దీన్, మహ్మద్ షఫీయుద్దీన్ అడ్వకేట్, ముహమ్మద్ సమీయుద్దీన్ అడ్వకేట్, ముహమ్మద్ సమీయుద్దీన్, ముహమ్మద్ ఫరూఖ్ అలీ, ముహమ్మద్ అయూబ్ అహ్మద్, ముహమ్మద్ మజీద్, హాఫీజ్ మహ్మద్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

- సీపీఐ (ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం



నవ తెలంగాణ-మెదక్ టౌన్

భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులను, పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, వారికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ (ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం కోరారు. మెదక్ పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో పార్టీ సెంటర్ శాఖ మహాసభ సందర్భంగా సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన బాధితులకు రూ.40 వేల నష్ట పరిహారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలన్నారు. మెదక్ జిల్లాలో భారీ వర్షాలకు ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబానికి రూ.10వేలు ఇస్తామని చెబుతున్నది. కానీ సర్వం కోల్పోయిన వారికి ఇది ఏమాత్రం సరిపోదన్నారు. కనీసం రూ.40 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి విపత్తుల సమయంలో దాతలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో భారీ వర్షాలకు వరి, పత్తి పంటలు నీట మునిగిపోయాయన్నారు. అధికారులు జిల్లాలో పర్యటన చేసి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం వెంటనే సహాయ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి బసవరాజు, మల్లేష్, దుర్గేష్, కమల, సత్యం పాల్గొన్నారు

శౌర్య యాత్రను జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం) చేర్యాల మండల, పట్టణ కార్యదర్శులు



నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 14న బైరాన్ పల్లిలో జరిగే శౌర్య యాత్ర, సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎం) చేర్యాల మండల, పట్టణ కార్యదర్శులు కొంగరి వెంకట మావో, రాళ్లబండి నాగరాజులు పిలుపునిచ్చారు. శౌర్య యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం చేర్యాల మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట మావో, నాగరాజులు మాట్లాడుతూ చేర్యాల నుంచి బైరాన్ పల్లి బురుజు వరకు బైకు ర్యాలీ ఉంటుందని, పార్టీ సభ్యులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, నాటి పోరాట యోధుల కుటుంబాల వారసులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దున్నేవాడికి భూమి కావాలని, వెట్టి చాకిరి నుంచి విముక్తి జరగాలని స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు ప్రజలందరికీ వర్తించాలని నాటి నిరంకుశ భూస్వామ్య దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా దొరల జమీందారుల, నైజాం నిరంకుశ రజాకార్ మూకల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిందన్నారు. ఈ వీరోచిత సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించి నాటి పోరాట చరిత్రను వక్రీకరించే నేటి పాలకులకు బుద్ధి చెప్పే విధంగా సాగే ఈ శౌర్య యాత్ర సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండ కింది అరుణ్ కుమార్, పార్టీ నాయకులు గొర్రె శ్రీనివాస్, దర్శనం రమేష్ , రాళ్ల బండి భాస్కర్, బోయిని మల్లేశం, పండుగ యాదగిరి, యాడారం బ్రహ్మయ్య, బావండ్ల పల్లి రమ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఏయల్‌ఓను నియమించాలి



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ ప్రాంతానికి రెగ్యులర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఎ.యల్.ఓ) ను వెంటనే నియమించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో సీఐటీయూ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి బి బసవరాజు మాట్లాడుతూ మెదక్ ప్రాంతానికి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ లేకపోవడం వల్ల ఈ ప్రాంత కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన క్లయిమ్స్, లేబర్ కార్డులు పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. మెదక్ ప్రాంతంలో చాలా కాలం నుంచి రెగ్యులర్ ఏఎల్ఓ లేరని, ఇంచార్జి ఏఎల్ఓ మాత్రమే ఉన్నారు. జిల్లాలో 8 మండలాలు మెదక్, టేక్మాల్, పాపన్నపేట, అల్లాదుర్గం, రేగుడ్, పెద్దశంకరంపేట్, ఘనాపూర్, చిన్న శంకరంపేట్‌లు ఎఎల్ఓ పరిధిలోకి వస్తాయన్నారు. ఈ మండలాల పరిధిలో ఇటుక బట్టీలు, ఖార్ఖానాలు, షాపులు అసంఘటితనంగా కార్మికులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. కార్మికులకు రెగ్యులర్ ఏఎల్ఓ లేకపోవడంతో కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. ఇందులో బాల కార్మికులు కూడా ఉన్నారన్నారు అయినా ఇప్పటి వరకు అధికారులు ఎవరూ కూడా తనిఖీలు చేయడం లేదన్నారు. ఏఎల్ ఓ ఆఫీస్‌కు అనేక మంది కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్నా ఇంచార్జి ఏఎల్ ఓ మాత్రం కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో సంగారెడ్డి నుంచి ఇంచార్జి ఏఎల్‌ఓగా ఉనప్పుడు పనులు జరిగేవన్నారు. ఇప్పుడు రామాయంపేట్ ఏఎల్ఓ ఇంచార్జి ఉండడంతో సమస్యలన్ని పెండింగ్‌లో ఉంటున్నా యన్నారు. కావున మెదక్ జిల్లా కేంద్రంలో తక్షణమే రెగ్యులర్ ఏఎల్‌ఓను నియమించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మల్లేశం, సభ్యులు లచ్చ గౌడ్, మల్లేష్ గౌడ్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-మనూర్



ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని.. దళారులను నమ్మి మోసపోవద్దని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మనూర్ మండల కేంద్రంలో పెసర్ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రోజున ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తున్నదన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానందరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న నీలం మధు

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఖైరతాబాద్ గణనాథుడు ప్రజల సర్వ విఘ్నాలను తొలగించి సర్వ శుభాలను ప్రసాదించాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని వినాయకుడిని సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు వీణ, అమీన్పూర్ కౌన్సిలర్ కొల్లూర్ మల్లేష్,ముకేష్,రాజశేఖర్, వి నారాయణ రెడ్డి, అశోక్,ఖైరతాబాద్ యూత్ సభ్యులు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-హత్నూర

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి ఒక పట్టణంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషన్, టర్నర్, వెల్డర్, సి మిషినిస్ట్, జి మోటార్, మెకానిక్ వెహికల్, ట్రేడ్లలో ఖాళీలు ఉన్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 20లోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాసు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 11 నుంచి 20 వరకు రోజు రిపోర్టు చేయాల న్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల న్నారు.

నాగలిగిద్దా ఎంపీడీఓగా కులకర్ణి మహేష్‌రావు

నవతెలంగాణ-మనూర్

నాగలిగిద్దా ఎంపీడీఓగా కులకర్ణి మహేష్‌రావు సోమవారం రోజున భాద్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ రాజశేఖర్ న్యాల్కల్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పదోన్నతి పై మహేష్‌రావు ఇక్కడ విధులు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు రూ.11,03500 విలువ గల 32 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాష్ట్ర వైద్య ఆరోగ్య, టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ అధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రామ గౌడ్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు కైసర్, మండల సీనియర్ నాయకులు మహిపాల్ రెడ్డి, గోవర్ధన్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వర్కల రమేష్, ప్రధాన కార్యదర్శి ఆగమయ్య,ఈశ్వర్ గౌడ్, గొల్ల రాములు, బాలా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రజలకు తప్పని పాట్లు

నవతెలంగాణ-కంది



మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నుంచి శంకర్పల్లి, బెంగ్లూర్ వెళ్లె పైపాస్ రోడ్డు తహసీల్దార్ కార్యాలయం ముందు రోడ్డు అధ్వానంగా మారింది. దాంతో వాహనదారులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎస్టిటీయూ సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక



నవతెలంగాణ-న్యాల్‌కల్

మెటల్‌కుంట పాఠశాలలో ఉపాధ్యాయుల ఎస్టిటియు సంఘం మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా కన్వీనర్ ఆకుల ప్రభాకర్, కొకన్వీనర్ కిష్టయ్య ఎన్నికల పర్యవేక్షణలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్టిటియు మండలాధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శి బాబర్, కోశాధికారిగా కాశీనాథ్ స్వామి, ఉపాధ్యక్షులుగా శేఖర్, కార్యవర్గ సభ్యులుగా శోభ సరిత, యాదప్పలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్టిటియు మండలాధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యా యుల సంఘం ఐక్యతతో సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాశీనాథ్ స్వామి, చంద్రకాంత్ రావు పాటిల్, మురళి, పాండయ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

నవతెలంగాణ-న్యాల్‌కల్



మిర్జాపూర్ (బి) పీజీ యూనివర్సిటీ కాలేజీలో లెక్చరర్ల బృందం, విద్యార్థులు మూడ్రోజుల పాటు గణనాథుడికి పూజలు చేసి.. సోమవారం నిమజ్జనం చేశారు. భక్తి పాటలతో భజన కీర్తనలతో సందడిగా నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిజి ప్రిన్సిపాల్ శివశంకర్, విద్యార్థులు కిరణ్ , సంతోష్ , రమణ, శివకుమార్ ఉన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు మేము వ్యతిరేకమే..



నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుకు తాము వ్యతిరేకమేనని రైతు హక్కుల సాధన సమితి కన్వీనర్ వెంకటేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అతిథి హెూటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తరతరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్న పంట పొలాలను వక్ఫ్ భూముల్లో చేర్చడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులు సాగు చేస్తున్న భూవ ులన్నింటినీ వక్ఫ్ భూముల గెజిట్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 13 వేల ఎకరాల భూమి వక్ఫ్‌లో నమోదయిందన్నారు. ఒక సత్వార్ గ్రామంలోనే 859 ఎకరాల భూమి ఉందన్నారు. కానీ ఈ భూమిలో తరతరాల నుంచి రైతులు పంటలు వేస్తున్నారన్నారు. ఆ రైతులకు సంబంధించిన భూములను నేడు వక్ఫ్ పరిధిలోకి తీసుకుపోవడం వల్ల వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రేపు(బుధవారం) ఎంపీ డీకే అరుణ జహీరాబాద్ వస్తున్న సందర్భంగా విన్నపాలతో కూడిన మెమొరండాన్ని ఆమెకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చంద్రశేఖర్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, నర్సింలు, రాజురెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదానం' ప్రారంభించిన నందారం నరసింహగౌడ్

నవతెలంగాణ-అమీన్‌పూర్



బీరంగూడలోని వడ్డెర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాన్ని అమీన్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని నరసింహ గౌడ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఉత్సవ కమిటీకి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతూ ఆ గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కమిటీ నిర్వాహకులు మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్‌ను గణేష్ ఉస్తవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర యూత్ గణేష్ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ బసవపురం లక్ష్మీ నరసయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బైపాస్‌లోని రెవెన్యూ కాలనీ వెనుక వైపు గల నీట మునిగిన ఇండ్లను పరిశీలించారు. వారికి తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని వారిని ఆదుకోవాలని కోరారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్, రవీందర్, ఎడ్ల రమేష్, మాజీ ఎమ్మెల్యే నారాయణఖేడ్ విజయపాల్ రెడ్డి, రాజేశ్వరరావు దేశ్పాండే, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నర్సింహారెడ్డి, రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య ఏదైనా రిజెక్ట్..?



- దరిచేరని ధరణి సమస్యలు
- ఏకపక్షంగా ఫైళ్లను తిరస్కరిస్తున్న వైనం
- డ్యాష్ బోర్డు క్లియర్స్‌కు అధికారుల అత్యుత్సాహం
- లోపాలను సవరించడంలో అధికారులు విఫలం
- రెవెన్యూ అధికారుల కొర్రీలు.. ఇబ్బందుల్లో రైతులు

నవతెలంగాణ-ఝరాసంగం

> తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ధరణి పోర్టల్ పలు సమస్యలకు నెలవుగా మారింది. ఆన్‌లైన్ విధానంలో భూమికి సంబంధించిన అన్ని లావాదేవీలు, సమాచారం పారదర్శకంగా ఉండేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను 2019 అక్టోబర్‌లో రూపొందించింది. పోర్టల్‌లో భూముల సమాచారం తప్పుల తడకగా ఉంది. ధరణి లోపాలను సవరించేందుకు అధికారులకు అవకాశం లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. పోర్టల్‌ను ప్రారంభించి ఐదేండ్లు గడిచినప్పటికీ లోపాలను సవరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు తీరుతాయనుకున్న రైతులకు ఇంకా నిరాశ మిగులుతుంది.

ఏకపక్షంగా తిరస్కరిస్తూ..

సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్‌లో అప్లయ్ చేసుకొని వందల మంది ఏడాది, రెండేండ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతు న్నారు. అలాంటి దరఖాస్తులను ఏకపక్షంగా అధికారులు తిరస్కరిస్తున్నారు. కనీసం జత చేసిన పత్రాలను కూడా చూడకుండా రిజెక్ట్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధరణి సమస్యలు డాష్ బోర్డులలో పెండింగ్లో ఉండకూడదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అదే అదునుగా చేసుకుని అధికారులు ఎక్కువ మొత్తంలో రిజెక్ట్ చేయడానికి మొగ్గు చూపుతున్నారు. క్షేత్ర స్థాయి విచారణ లేకుండా రిజెక్ట్ చేసినవి కొన్నయితే.. అన్ని పత్రాలను జతచేసినప్పటికీ రిజెక్ట్ అవుతున్నాయని రైతులు వాపోతున్నారు. నిన్నటి దాకా ధరణి పోర్టల్‌లో ఆర్డీఓ లేదా తహసీల్దార్ దగ్గర అప్లికేషన్ పెండింగ్ అని చూపించేది. ఇప్పుడు మీ ప్రాపర్టీ నిషేధిత జాబితాలో ఉందని, టీఎం 15 లేదా టీఎం 33 కింద అప్లయ్ చేసుకోవాలంటూ ట్రాన్సాక్షన్ స్టేటస్‌లో చూపిస్తున్నది. దాంతో ఇప్పుడు మరోసారి అప్లయ్ చేసువాల్సి ఉంటుంది. అలా చేస్తే కొత్త ఫైల్‌గా ముద్ర పడుతు ంది. మళ్లీ వ్యవహారం మొదటికే వస్తుంది. భూ సమస్యల పరిష్కారానికి సీఎం, మంత్రులు ఆదేశిస్తున్నా.. రెవెన్యూ అధికారులు మాత్రం అప్లికేషన్లను రిజెక్ట్ చేస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. మరోపక్క ఏ ప్రభుత్వం వచ్చిన తమ సమస్య లు సమస్యలుగానే మిగిలిపోతున్నాయని నిరాశ చెందుతున్నారు.

30 ఏండ్ల రికార్డు ఉన్నప్పటికీ...

ఓ రైతు తనకున్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో గత 30 ఏండ్ల నుంచి సాగు చేస్తూ వస్తున్నారు. ప్రజా ప్రయోజన దృష్ట గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ సేకరణ కింద నాలుగు ఎకరాలు ప్రభుత్వం తీసుకుంది. పరిహారం కూడా నాలుగెకరాలకు మాత్రమే చెల్లించారు. కానీ రైతు పాస్ పుస్తకం నుంచి ఐదు ఎకరాలను టీజీఐఐసి కింద రెవెన్యూ అధికారులు మార్చేశారు. ఇదేమిటని అధికారులను పలు మార్లు ప్రశ్నించినా.. ప్రయోజనం లేకపోయింది. గతవారం రోజుల క్రితం మిస్సింగ్ సర్వే నంబర్ కింద టీఎం33లో దంఖాస్తు చేసుకుంటే మూడు రోజుల్లోనే ఎలాం టి విచారణ చేయకుండా రిజెక్ట్ చేశారు. 'వాస్తవానికి మీరు జన్యున్ రైతు అయి ఉండవచ్చు కానీ ఇక్కడి నుంచి మేము యాక్సెప్ట్ పంపిన పై నుండి ఫైల్స్ అన్ని మళ్ళీ రిజెక్ట్ అయి వస్తున్నాయి. ఇందులో మా తప్పు ఏమీ లేదు. ఇంకొన్ని రోజు లు ఓపిక పట్టండి. కొత్త సాఫ్ట్వేర్ వచ్చాక దరఖాస్తులు చేసు కోండి' అంటూ తహసీల్దార్ సమాధానం ఇవ్వడం విడ్డూరంగా ఉంది.

డ్యాష్ బోర్డు క్లియర్‌కు అత్యుత్సహం..

ప్రస్తుతం డ్యాష్‌బోర్డ్ క్లియర్ చేస్తున్న వాటిలో ఏ కారణం లేకుండా తిరస్కరిస్తున్న ఫైళ్లే అత్యధికం. కనీసం ఎందుకు రిజెక్ట్ చేశారో తెలియని పరిస్థితి ఉంది. గతంలో అప్లికేషన్ తిరస్కరణకు గురైనట్టు కారణాలు తెలుపుతూ దరఖాస్తుదారుడికి మెస్సేజ్ వచ్చేది. ఇప్పుడు అది కూడా రావడం లేదు. మిస్సింగ్ ఫైల్స్ ఏమైనా ఉంటే అడిగితే తిరిగి అప్‌లోడ్ చేయొచ్చు. కానీ డ్యాష్ బోర్డు క్లియర్ చేసేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం చూపిస్తున్నా రన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ రిటైర్మెంట్ అవ్వడంతో నూతన తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించగానే అప్పటి దాకా పెండింగులో ఉంచిన ఫైళ్లన్నీ గంపగుత్తగా రిజెక్ట్ చేస్తున్నారు. ఏకంగా.. దరఖాస్తులను తిరస్కరించారు. వాటన్నింటినీ రెండు రోజు ల్లోనే పరిశీలించినట్లు రికార్డులో రాసుకున్నారు. నిజానికి ఏ కారణం చెప్పకుండా రిజెక్ట్ చేసి ఆ కుటుంబాలను తీవ్ర మనోవేదనకు గురి చేశారు. అడిగితే ఇక్కడ భూముల పెద్ద తలనొప్పిగా ఉన్నాయి. ఏ చిన్న పొరపాటు జరగొద్దనే అలా చేశాం. మళ్లీ అప్లయ్ చేసుకోవాలని చెప్పినం. అంతే తప్ప అందులో ఏ దురుద్దేశ్యాలు లేవని సమర్థించుకున్నారు. దీంతో మళ్లీ అప్లయ్ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

రెవెన్యూ అధికారుల కొర్రీలు..

ధరణి పోర్టల్ ద్వారా వివిధ సమస్యలపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్నింటిని పరిష్కరించారు? ఎన్నింటిని రిజెక్ట్ చేశారు? ఎన్ని దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి? ఈ అంశాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. అందిన దరఖాస్తుల వివరాలను చెప్పడం చట్టవిరుద్ధమంటూ రిప్లయ్ ఇస్తుండడం పలు అనుమానాలకు దారి తీస్తున్నది. సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకుంటే అది ప్రభుత్వ భూమి కాదు.. పట్టా అని మీరే రుజువులు సమర్పించాలంటూ రెవెన్యూ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. తరతరాలుగా అనుభవిస్తున్నామని, కొనుగోలు చేసినట్లుగా సేల్ డీడ్స్ ఉన్నాయని చెప్పినా వినిపించుకోవడం లేదు. తహశీల్దార్, కలెక్టర్లను ఒప్పిచినా... చాలాసార్లు ఫైల్ రిజెక్ట్.. రీ కన్ఫర్మేషన్ అంటూ పంపిస్తుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోపాలను సవరించడంలో అధికారుల విఫలం

ధరణి పోర్టల్‌లో లోపాలను సవరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఏండ్ల తరబడి వేల ఎకరాలకు సంబంధించి చాలా మంది పట్టాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పట్టాదారులు అత్యవసర సమయాల్లో భూమి విక్రయించేందుకు ధరణి పోర్టల్ పొరపాట్ల వల్ల ఆశలు అడియాశలవుతున్నాయి. అధికారులు చేసిన తప్పిదాల వల్ల ప్రజల ఆస్తి హక్కుకు రక్షణ లేకుండా పోయింది. పిల్లల ఉన్నత విద్య, పెళ్లిల్లు, గృహ నిర్మాణం, వైద్య చికిత్సల ఖర్చులు, అప్పులు తీర్చుకోవడం, ఇతర అత్యవసరాలకు కూడా పట్టా భూములను విక్రయించుకోలేని దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల కలిగే నష్టాలను తొలగించి సమస్యలకు సత్వర పరిష్కారాలను చూపాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలకు 'రిజెక్ట్' పరిష్కారం కాదు..



ధరణి పోర్టర్ లోని సక్సేషన్, పెండింగ్ మోటేషన్, కోర్టు తగాదాలు, జిఎల్ఎం, టీఎం 33, సర్వే నెంబర్లు మిస్సి ంగ్, పట్టాదారు పేర్లు ఫోటోలలో మార్పులు, విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, పట్టా అసైన్డ్ భూములుగా నమోదు, నాలా, జిపిఎ,పిఓబి, పాస్ బుక్ డేటా కరెక్షన్ వంటి పెండి ంగ్ దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలకు పరిష్కారం చూపాలి. సంవత్సరాలు గడు స్తున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో బాధి తులు తాసిల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ కార్యాల యాల చుట్టూ చెప్పులరిగెల తిరుగుతున్న పరిష్క రించకపోతున్నారు. ఎన్నటికైనా త సమస్య పరిష్కారం కాకుండా పోతుందా అని ఊహించిన రైతులకు నిరాశ మిగులుతుంది. చిన్న చిన్న సాకులతో అధికారులు దరఖా స్తులను రిజెక్ట్ చేయడం సమంజసం కాదు. ఒక్కో టీఎం 33 దరఖాస్తుకు రూ.1300 వరకు ఖర్చు అవుతుంది. ఎన్నిసార్లు రైతులు దరఖాస్తు చేసిన అధికారులు రిజెక్ట్ చేయడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. మండల స్థాయిలో సిబ్బందిని పెంచి ధరణి సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలి.

-జగదీశ్వర్, మాజీ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారిణి పద్మజ రాణి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా సీపీఓ బాలశౌరి, కలెక్టరేట్ పరిపాలధికారి పరమేష్‌లతో కలిసి ప్రజల నుంచి 96 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారించాలన్నారు. భూమి సమస్యలు అధికంగా వస్తున్న క్రమంలో మండల స్థాయిలో పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పంటల వివరాలను, రైతుల పొలాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. ఈ ప్రజావాణిలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-రామచంద్రాపురం



ఈఎస్ఐ హాస్పిటల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈఎస్ఐ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు పెండింగ్లో ఉన్న మొత్తం జీతాలను వెంటనే ఇవ్వాలని సంగారెడ్డిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ వేతనాలతో ఈఎస్ఐలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికులకు ప్రతినెలా జీతాలు రాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనేక సందర్భాల్లో స్థానిక సూపరింటెండెంట్‌కు, అధికారులకు తెలియజేసినా ఫలితం లేదన్నారు. అందుకే డిప్యూటీ లేబర్ కమిషనర్ సంగారెడ్డికు.. ప్రతినెల జీతాలు ఇవ్వని కాంట్రాక్టర్లను రద్దు చేయాలని. పెండింగ్లో ఉన్న వేతనాలను వెంటనే ఇప్పించాలని, ఈఎస్ఐ,పిఎఫ్ తదితర సమస్యలు పరిష్కరించాలని విన్నవించామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయకుంటే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజయ్య,యాదయ్య,సురేష్, సిద్దు,సంతోష్ కుమార్‌పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల క్షేత్రస్థాయి పరిశీలన



నవతెలంగాణ-రాయికోడ్

మండల పరిధిలోని దల్లాబాద్, సిరుర్, రాయికోడ్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వివిధరకాల పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేతలు, వ్యవసాయ అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంట పొలాల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు సూచించారు. ముందుగా వర్షపు నీటిని ప్రధాన పొలం నుంచి కాలువల రూపంలో తీసెయ్యాలన్నారు. అనంతరం కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి మొక్కల వేరు వ్యవస్థ తడిచే విధంగా పిచికారి చేసుకోవాలన్నారు. అదే విధంగా 1 కేజీ యూరియాను మరియు 10 నుంచి 15 కేజీల పొటాష్‌ను పై పాటుగా మొక్కలకు వేయాలన్నారు. పిందె మరియు కాయలు రాలకుండా మల్టీ-కే (13-0-45)ను 10 గ్రాములు లీటరు నీటికి చొప్పున పిచికారీ చేయాలన్నారు. రైతులెవరూ అధైర్యపడొద్దన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, సహాయ వ్యవసాయ అధికారు సారిక, శ్రీనివాస్ రెడ్డి మరియు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు యాదయ్య, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

నవతెలంగాణ-సదాశివపేట



వర్షాల వల్ల పంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మంజీర రైతు సమైక్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి విజ్ఞప్తి చేశారు. స్థానికంఆ గల మంజీర రైతు సమైక్య కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పత్తి, మిరప, మొక్కజొన్న, మినుము, వివిధ రకాలైన పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లకు నష్టపోయిన పంటల వివరాలు తెలపాలని సూచనలు చేసిందన్నారు. కలెక్టర్లు వ్యవసాయ అధికారులకు పంట నష్టాన్ని పంపాలని కోరినా.. ఇప్పటికీ ఎక్కడా కూడా అమలు కాలేదన్నారు. ఎకరాకు 40,000 పెట్టుబడులు పెట్టి నష్టపోయిన రైతులకు.. ప్రభుత్వం ఆదుకుంటామని చెబుతున్నా.. అధికారుల నిర్లక్ష్యం వల్ల పంట నష్ట వివరాలు ప్రభుత్వానికి అందలేదన్నారు. ఇప్పటికైనా గ్రామ, గ్రామాన తిరిగి పంటలను సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, రామ్‌రెడ్డి, జ్ఞానోబా, నాన్‌రెడ్డి, నరసింహారావు, విటల్, పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళ్లు..





నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతిని కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా రెవిన్యూ అధికారిణి పద్మజ రాణి సోమవారం రోజున కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ అధికారి ఐనేష్ నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి, కలెక్టరేట్ పాలనాధికారి పరమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాలతో క్యాంపు కార్యాలయంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు,పట్టణ ఉప అధ్యక్షులు మోహన్, పట్టణ మైనార్టీ కార్యదర్శి అజీమ్, సురేష్ నాయక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : కాళోజీ నారాయణరావు 110వ జయంతిని సోమవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లోని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ఘనంగా నిర్వహించింది. కవిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ప్రజా కనిగా పేరొందిన పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపు కుంటున్న విషయం విదితమే.గీతలో నెలకొల్పిన కాళోజీ నారాయణరావు విగ్రహానికి గీతం హైదరా బాద్ అదనపు ఉపకులసతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఆంగ్ల అధ్యాప కుడు ప్రొఫెసర్ డీ.ఆర్.పీ.చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు ఘన నివాళులు అర్పించారు. కాళోజీ సగటు మానవుల సంక్షేమం కోసం తన జీవితాంతం కృషి చేశారంటూ, ఆయన మాననీయ సేవలను స్మరించుకున్నారు.

హత్నూర : ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు నివాళ్లర్పించారు. అనంతరం తహశీల్దార్ ఫార్విన్ షేక్ మాట్లాడుతూ.. తెలం గాణ ఉద్యమంలో కవి కాళోజీ నారాయణరావు అన్ని ట్లో పాత్రధారులుగా ఉంటూ తెలంగాణ దశాదిశ నేర్పిన మహావ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ తహశీల్దార్ దావుద్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు కృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కాలేజీ చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలోజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

ఆచార్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్ పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైతే అణిచివేత ఉందో అక్కడ తన కలం ద్వారా చైతన్యం పరిచిన వ్యక్తి కాళోజి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎం వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నందుగౌడ్, నర్సింలు, దత్తు నిఖిత, దీపిక, నవీన, లావణ్య, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం : మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆధ్వర్యంలో మున్సిపల్ తాత్కాలిక కార్యాలయంలో కాళోజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మేనేజర్ నిర్మల రెడ్డి, ఆర్ఓ నర్సింలు, ఏఈ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం రాధాబాయి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం తెలుగు భాష టీఎల్ఎం మేళను భాషా ఉపాధ్యా యురాలు మాధవి, లావణ్యల ఆధ్వర్యంలో విద్యా ర్థులతో ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మజ, శ్రీలత, సుశీల, రాధిక, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో దొంగల బీభత్సం



నవతెలంగాణ-చిన్న శంకరంపేట.

మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో గల రేణుకా మాత మద్యం దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి నగదు, మద్యం సీసాలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మద్యం దుకాణం తాళం పగులగొట్టి దుండగులు దుకాణంలోకి చొరబడ్డారు. సుమారు రూ.15 వేల నగదు, రూ.25వేల విలువగల మద్యం సీసాలను ఎత్తుకెళ్లారని దుకాణం యజమాని తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ను రప్పించారు. సిసి కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు దుండగులు మాస్కులు ధరించి దొంగతనానికి పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై నారాయణ తెలిపారు.

ఎస్‌టీయూ సంఘం సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-చేగుంట

ప్రభుత్వం నాలుగు డీఏలను సత్వరమే ప్రకటించాలని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగోపాల్, పోచయ్యలు డిమాండ్ చేశారు. మండలంలోని మక్కా రాజుపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేయించామని, అలాగే 317 జీవో బాధ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ ఉపాధ్యాయులు మనోహర్ రావు, పెంటా గౌడ్, పాండు, వారాల నర్సింలు, జగన్ లాల్, చిట్టబోయిన సత్యనారయణ, సమీయొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు

- 125 అర్జీలను స్వీకరించిన కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ - హవేలి ఘనాపూర్

మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో వచ్చిన విజ్ఞప్తులు, వినతులు, అర్జీలు, సమస్యలను సంబంధిత శాఖల అధికారులు ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించగా కలెక్టర్ రాహుల్ రాజ్ స్వయంగా ప్రజల నుంచి మొత్తం 125 దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రైతు రుణమాఫీకి సంబంధించి 40, ధరణికి సంబంధించి 30, పింఛన్లకు సంబంధించినవి 04, రెండు పడకల గదుల ఇండ్ల కొరకు 08, ఇతరత్రా 43 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఈ మేరకు కలెక్టర్ రాహుల్ రాజ్ స్వయంగా ఒక్కోదానిని పరిశీలించి సంబంధిత అధికారులకు వాటిని అక్కడే అందచేసి ప్రభుత్వ నియమ నిబంధన మేరకు పరిష్కరించాల్సిందిగా సూచించారు. ప్రజావాణి సమస్యలను పరిష్కరించే విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించాదని అర్జీలు అందచేసిన వారు తిరిగి రెండోసారి రాకుండా సమస్యలను పరిష్కరించాల్సిందిగా తెలిపారు. దీంతో పాటు సమస్యల పరిష్కారానికి వీలులేనట్లయితే తదుపరి చర్యల కోసం వారికి అర్థమయ్యే విధంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీకి సంబంధించిన కుటుంబ సభ్యుల నిర్ధారణ అప్లికేషన్లు తీసుకోవడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి తెలిపారు. మరో వందమంది రైతులు తమ కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకోవాల్సి ఉందని, వారు త్వరగా చేసుకోవాలని కోరారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



నవతెలంగాణ-నిజాంపేట

కాళోజి జయంతి సం దర్భంగా మండలం పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దిరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషోపాధ్యాయులు యాడవరం చంద్రకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు, ఒక నిమిషం తెలుగులో మాట్లాడడం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మారెడ్డి మాట్లాడుతూ కాళోజి తెలంగాణ భాషకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరయ్య, అర్జున్, సుకన్య, నరేష్, కుమారస్వామిలు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం



నవతెలంగాణ-చేగుంట

చేగుంట ఉన్నత పాఠశాలలో కాళోజి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ నీరజ మాట్లాడుతూ కాళోజి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని రజాకర్లను ఎదిరించి జైలు జీవితం గడిపారన్నారు. మన యాస, మన భాషకు దిక్సూచి అని, పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది, అన్యాయాన్ని ఎదిరించినవాడు నాకు ఆరాధ్యుడని, అక్షర రూపం దాల్చిన ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలికని, అనే సూక్తుల ద్వారా తెలంగాణ జాతిని చైతన్య పరిచిన దీశాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్, రఘుపతి, చల్లా లక్ష్మణ్, రావుల వెంకటేష్, రాధా, సరస్వతి, భవాని, శ్రీ వాణి, రమా రమాదేవి, ఉమాదేవి,శారద, ఉమామహేశ్వరి, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

టీపీసీసీ అధ్యక్షునిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్‌ను సోమవారం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు తాడెం వెంగళరావులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఇన్చార్జి హరికృష్ణ, సుప్రభాతరావు, డిసిసి అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి, నాయకులు విజయపాల్ రెడ్డి, సోలిపేట ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గణనాథునికి పూజలు



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని పైతర గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి ముదిరాజ్ సంఘం సభ్యులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజులు నిత్య పూజలు అందుకొనున్న గణనాథుడు చివరి రోజు గంగ ఒడికి చేరనున్నాడు. నవరాత్రుల్లో భాగంగా నిత్యం మండపం వద్ద భజన భక్తులు వినాయకుని నామస్మరణాలతో మార్మోగిస్తున్నారు. అలాగే యువకులు నృత్యాలు చేస్తూ పలువురిని ఆకట్టుకుంటున్నారు. దీంతో తొమ్మిది రోజులు జరిగే వేడుకలు అంబరాన్నంటుతున్నాయి.


చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



నవతెలంగాణ-మద్దూరు

మద్యం మత్తులో పురుల మందు తాగి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన దూళ్మిట్ట మండలంలోని హనుమతండ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం హనుమతండ గ్రామానికి చెందిన బానోతు కిషన్,(56) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఈనెల 8వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చిన కిషన్‌తో భార్య మంగ్లీ, మధ్య చిన్న గొడవ జరిగిందని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన కిషన్ మద్యం మత్తులో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో వెంటనే కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 4 గంటలకు మృతి చెందాడు. మృతుని కుమారుడు బానోతు జితేందర్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులకు గ్రామర్ రీడింగ్ రైటింగ్ బుక్స్ అందజేత



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కొనాపూర్ హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్పందన చారిటీ ట్రస్ట్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ వారిచే సౌజన్యంతో విద్యార్థులకు గ్రామర్ రీడింగ్ రైటింగ్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన చారిటబుల్ ట్రస్ట్ తన ఉదార స్వభావాన్ని చాటుకొని విద్యార్థులకు బుక్స్ డొనేట్ చేసిందన్నారు. గజ్వేల్ మండలం కోనాపూర్ పాఠశాలకు 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంకు సంబంధించిన గ్రామర్ రీడింగ్ రైటింగ్ బుక్స్ సుమారు రూ. 15 వేల అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. మహేష్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మెన్ రఫియా, అంగన్వాడి టీచర్ సుమలత, విద్యార్థుల తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.

కాళోజి చేసిన సేవలు మరువలేనివి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

తెలుగు సాహితీ రంగానికి ప్రజాకవి కాళోజీ చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కాళోజి 110 జయంతిని పురస్కరించుకుని సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కాళోజి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి జయంతిని ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని ఎంతో మంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనీకుడు కాళోజీ నారాయణ రావు అని, తెలంగాణ భాషా పరిరక్షణకు కృషి చేయడంతో పాటు తన కవితల ద్వారా ప్రజల్లో ఉద్యమ చైతన్యం నింపిన మహనీయుడుగా అభివర్ణించారు. భారత దేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌తో సన్మానింప బడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్ఫూర్తిని ప్రజలు కొనసాగించాలని కోరారు. తెలంగాణ భాష, యాస వేళాకోళానికి గురైతే బాధపడి, ప్రత్యేక తెలంగాణను సమర్థించి పోరాటం చేశారన్నారు. కాళోజీ గొప్ప మానవతావాది, వైతాళికుడని, స్వచ్ఛమైన మనిషి అని కొనియాడారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, తెలంగాణ రచయితల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షురాలు కవిత, సెక్రెటరీ సంతోష్, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్ గౌడ్ సేవలు అభినందనీయం

- తండ్రి జ్ఞాపకార్థంగా శాశ్వత వినాయక షెడ్డు నిర్మాణం



నవతెలంగాణ- కొల్చారం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల గౌడ సంఘం అధ్యక్షులు అప్పాజీపల్లి గ్రామానికి చెందిన నాయిని వెంకట్ గౌడ్ (గజిని) సేవలు అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు. వినాయక నవరాత్రుల ఉత్సవాల్లో బాగంగా కీ.శే. నాయిని కిష్టా గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకట్‌గౌడ్ (గజిని) గ్రామంలో రూ.2 లక్షలతో శాశ్వత వినాయక మండప నిర్మాణం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో మొట్టమొదట ప్రారంభించిన వినాయక నవరాత్రుల ఉత్సవ విగ్రహానికి శాశ్వత మండపాన్ని నిర్మించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా మండప నిర్మాణ దాత నాయిని వెరట్ గౌడ్ (గజిని) మాట్లాడుతూ వినాయక మండపం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక మండప నిర్వాహకులు కొమ్ముల నరేందర్ గౌడ్, చలం యాదగిరి, సదాల నర్సింలు, చలం నర్సింలు, సదాల తిరుపతి, పితిరి ఏగొండ, చింతల సురేందర్, కోరంపల్లి వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ దేవయ్య, చలం శ్రీహరి, చలం గణేష్, చలం సాయి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రెండు సంవత్సరాల ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి



- టీపీటీఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య

నవతెలంగాణ-పాపన్నపేట : రెండు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఉపాధ్యాయుల జీపీఫ్ పార్టీ ఫైనల్స్, లోన్లు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్‌ల బిల్లులు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా శాఖ అధ్యక్షులు సంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్ హీరాలాల్, కొత్తపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్ గౌడ్, నాగసానిపల్లి ప్రధాన ఉపాధ్యాయులు రామ్ కిషన్, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, నజీరుద్దీన్, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలరాజు, రమేష్ జిల్లా నాయకులు విక్రమ్ గౌడ్, సుబ్బారావు, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

దీన స్థితిలో పేద కుటుంబం

- దాతలు ఆర్థికంగా ఆదుకోవాలి
- పెరాలసిస్‌తో బాధపడుతున్న గోపి వేణుగోపాల్
- భార్య అనురాధ, పిల్లల వేడుకోలు
- ఆర్థిక సాయమందించని జీఎంఆర్ టోల్ ప్లాజా యాజమాన్యం



నవతెలంగాణ - తూప్రాన్

తూప్రాన్ మున్సిపాలిటీలోని పోతరాజుపల్లికి చెందిన గోపి వేణుగోపాల్ అనారోగ్యానికి గురయ్యారు. తమ కుటుంబానికి ఆర్థిక సాయమందించాలని వేణుగోపాల్ భార్య అనురాధ, పిల్లలు దాతలను వేడుకుంటున్నారు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పోతురాజు పలికి చెందిన గోపి వేణుగోపాల్ గత మూడు నెలల క్రితం పక్షవాతానికి గురై మంచం పట్టాడు. ఇతను 10 సంవత్సరాల నుంచి తూప్రాన్‌లోని అల్లాపూర్ 44 జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాలో ఉద్యోగిగా పనిచేశాడు. గత కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురై టోల్ ప్లాజాలో ఉద్యోగానికి వెళ్లడం మానేశాడు. అప్పటి నుంచి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. 10 సంవత్సరాలుగా ఉద్యోగం చేసినప్పటికీ టోల్ ప్లాజా ఉద్యోగికి ఎలాంటి ఆర్థిక సహాయం అందించకపోవడం శోచనీయం.10 సంవత్స రాలు టోల్ ప్లాజాలో ఉద్యోగం చేసిన వేణుగోపాల్ పేరుపై జీఎంఆర్ యాజమాన్యం ఎలాంటి హెల్త్ ఇన్సూరెన్స్ నమోదు చేయలేదని బాధితుడి భార్య వాపోయారు. పేద కుటుంబమైన తమను ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని జీఎంఆర్ యాజమాన్యంను వేడుకున్న కనికరించలేదని బాధితుడి భార్య అనురాధ ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ ప్లాజాలో పనిచేసే ఉద్యోగులు మాత్రమే తలా కొన్ని డబ్బులు జమ చేసి తమకు ఆర్థిక సహాయం అందించారన్నారు. .గత మూడు నెలలుగా రూ.3 లక్షలకు పైగా హాస్పిటల్ ఖర్చులు పెట్టామని అనురాధ తెలిపింది. వేణుగోపాల్‌కు హైదరాబాద్ లోని ఇఎస్ఐ సనత్ నగర్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, వాసవి హాస్పిటల లలో 3 నెలలుగా చికిత్స చేయించామన్నారు. చివరగా తూప్రాన్ గవర్నమెంట్ హాస్పిటల్లో కూడా చికిత్స జరిగిందన్నారు. తన భర్త ఆరోగ్యం కుదుట పడటానికి ఫిజియోథెరపీ, టెక్నికల్ ఆపరేషన్‌కు



సుమారుగా మరొక రూ.2 లక్షలు కావాలని వైద్యులు తెలిపారన్నారు. అంత డబ్బు తమ దగ్గర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని బోరున విలపించింది. ఎవరైనా దాతలు ఉంటే ఆర్థిక సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. తమకు శరత్ చంద్ర, గోపీచంద్ అనే ఇద్దరు కుమారులున్నారని తెలిపారు. పేద స్థితిని బట్టి పిల్లల భవిష్యత్తు ఆగమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా సహాయం చేయాలనుకుంటే గూగుల్ పే, ఫోన్ పే నెంబర్ 703259685 చెట్లపల్లి స్వామి అనే నంబర్‌కు డబ్బులు పంపించి, ఆర్థిక సహాయం అందించాలని, తమ కుటుంబాన్ని అనుకోవాలని కోరారు. బ్యాంక్ అకౌంట్ నెంబర్ 923010038709314 యాక్సిస్ ఖాతా నంబర్‌కు పంపించాలని కోరారు. దాతలారా ఆదుకోండి మహా ప్రభో అని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.


పోషక ఆహారంపై గర్భిణులకు అవగాహన



నవతెలంగాణ -చిన్న శంకరంపేట

పోషక ఆహారంపై గర్భిణీలకు హెల్త్ సూపర్వైజర్ అంజమ్మ అవగాహన కల్పించారు. మండలంలోని రుద్రారం గ్రామంలో సోమవారం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్ల తల్లులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలు మాత్రమే పిల్లలకు ఇవ్వాలని, డబ్బా పాలు పట్టడం వలన పిల్లల ఎదుగుదల చెందరని అన్నారు. గర్భిణీ స్త్రీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పోషక పదార్థాలు తీసుకోవడం వలన పుట్టబోయే పిల్లలు, తల్లి సురక్షితంగా ఉంటుందని అన్నారు. పోషక పదార్థాలు తీసుకోకపోవడం వలన అనేక అనారోగ్య ఇబ్బందులు ఎదురవుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సలీమా, రాణి, గర్భిణీ స్త్రీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో



నవతెలంగాణ-చిన్న శంకరంపేట.

చిన్న శంకరం పేట మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని జెడ్పి సీఈవో సందర్శించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ రికార్డులను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో దామోదర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కాళోజి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా కవి కాళోజీ నారాయణ రావు జయంతి పురస్కరించుకొని మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ కాళోజి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రజాకవి అని ఉద్యమ సమయంలో వారి కవితలు ప్రజల్లోకి వెళ్లాయని తద్వారా ఉద్యమం మరింత బలోపేతం అయిందని వారిని తెలంగాణ సమాజం మరువదు అని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు . అలాగే ప్రజలకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జాకీ ఉద్దీన్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, కౌన్సిలర్స్, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ యాస, భాష, తొలి దశ మలిదశ ఉద్యమాల్లో పాల్గొని మూడు తరాలకు స్ఫూర్తినిచ్చిన మహనీయుడు కాలోజి నారాయణరావు అని రోటరీ క్లబ్ ఆఫ్ గజ్వేల్ సెంట్రల్ అధ్యక్షులు తుమ్మ కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో కాలోజి 111వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారుడు కమ్మరి బాలరాజు మాట్లాడుతూ మన ప్రాంతం వాడు కాకపోయినా తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన మహానీయుడు. ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు కేసీఆర్ లాంటి నాయకులకు స్ఫూర్తినిచ్చి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన మహనీయునికి నివాళులర్పించడం ఎంతో సంతో దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ మండల అధ్యక్షులు సిహెచ్ కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తదితరులున్నారు.

నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రాథమిక పాఠశాల కాసులబాద్‌లో తెలంగాణా భాష దినోత్సవం సందర్భంగా కాళోజీ నారాయణరావు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన కలంతో తెలంగాణా ప్రజలను చైతన్యం చేసి ఉద్యమం వైపు నడిపించిన మహనీయుడు, కాళోజి అన్నారు.పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని తన జీవితాన్ని సమాజ హితానికి అంకితం చేసిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని కొనియాడారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ కృష్ణమూర్తి శివకుమార్, విద్యా ప్రకాష్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-గజ్వేల్

ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బడి పలుకుల భాష కాకుండా పలుకుబడుల భాష కావాలని ఆరాటపడ్డ కాళోజీ నారాయణరావు తెలంగాణ ఉద్యమాలు అన్నింటితో అనుబంధం కలిగి ఉన్నారని కళాశాల ప్రిన్సిపాల్ అంజుమ్ అన్నారు. మాతృభాషను ప్రాంతీయ భాషలను పరిరక్షించుకున్నప్పుడే దేశ అస్తిత్వం నిలబడుతుందని తెలిపారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల తెలుగు భాగాధిపతి డాక్టర్ ఆర్ మహేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ సురేందర్ రెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళోజి ఆశయాలకు అనుగుణంగా పలుకుబడుల భాష రావాలి. మన తెలంగాణ యాస భాషను మనం కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి శ్రీనివాస్, అధ్యాపకులు,















తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సిద్దిపేట విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో కాలేజీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. పాఠశాల ఆవరణలో ఉన్న బడి తోటను, ఇంకుడు గుంతను, వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల శ్రీనివాస్, పిడి నర్రా భాస్కర్ రెడ్డి , ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగు అధ్యాపకురాలు పి. స్వాతి నిర్వహణలో విద్యార్థులు ప్రతాపరుద్ర విజయం రూపకం చేశారు. దీనిలో తెలంగాణ సాహిత్య ఔనత్యాన్ని చాటిచెప్పారు. విద్యార్థులకు కళాశాల తెలుగు శాఖ యాజమాన్యం కవిత్వం పద్యగానం పాటలు ఉపన్యాసాలు మొదలగు సాంస్కృతిక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ గడ్డం భాస్కరావు మాట్లాడుతూ తెలంగాణ భాషను అక్షర బద్ధం చేసి వివిధ ప్రక్రియలో రచనలు జరగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ పి గోవిందరావు తెలంగాణ భాష అస్తిత్వం గురించి చక్కగా వివరించారు. ఏటీపీ ఉమామహేశ్వరి గారు మాట్లాడుతూ తెలంగాణ భాషలోని పారిభాషిక పదాలను గూర్చి వివరించారు. తెలుగు అధ్యాపకురాలు ఏ. మృణాళిని చక్కని పలుకులతో వందన సమర్పణ చేసి సభని ముగించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వర్కోలు లక్ష్మయ్యకు తెలంగాణ పద్య సారస్వత పీఠం

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా తెలంగాణ పద్య సారస్వత పీఠం వారు రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించగా,సిద్దిపేటకు చెందిన వర్కోలు లక్ష్మయ్యను సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా పద్యాలు, కథలు, గేయాలు, చిత్రలేఖనం మొదలైన ప్రక్రియలు నేర్పించిన ఉపాధ్యాయులను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నుకున్నారని, సంస్థ అధ్యక్షులు డా. అవుసుల భాను ప్రకాష్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో

ఈనాడు దినపత్రిక ప్రధాన సంపాదకులు ప్రసాద్, ఈ గురుకులం ఐఏఎస్ ఫౌండర్ ఆకెళ్ళ రాఘవేంద్ర, జాతీయ సాహిత్య పరిషత్ జాతీయ అధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు డి. నాగేందర్ రెడ్డి,ఎం. పూర్ణచంద్రరావు, తదితరులు ఆయనను అభినందించారు.

మహిళల రక్షణకు చట్టాలు కఠినంగా ఉన్నాయి

- చేర్యాల సీఐ శ్రీను



నవతెలంగాణ-మద్దూరు

మహిళల రక్షణకు చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని చేర్యాల సీఐ శ్రీను తెలిపారు. మండలంలోని లద్నూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కమిషనర్ ఆదేశాల మేరకు బాలికల మహిళల రక్షణ పై ఉన్న చట్టాలపై షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ సైబర్ క్రైమ్ సైబర్ సెక్యూరిటీ మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై విద్యార్థుల కు అవగాహన కల్పించినట్లు తెలిపారు. యువత డ్రగ్స్ కు బానిసటావద్దని మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు పాఠశాలలకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఏఎస్ఐ జిల్లా జగదీష్, హుస్నాబాద్ డివిజన్ షీ టీం బృందం సైదయ్య ,హెడ్ కానిస్టేబుల్ మహిళా కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో గ్రామ పరిదిలో గల 132కేవీ సబ్ స్టేషన్లలో పరిధిలోని పాతూరు వద్ద మరమత్తులు కారణంగా చేబర్తి, అంగడికిష్టాపూర్‌లో విద్యుత్ సేవలు మంగళవారం(నేడు) ఉదయం10.00 నుంచి మధ్యాహ్నం 12:00గంటల వరకు నిలిపి వేయబడునని మర్కుక్ విద్యుత్ ఏఈ సుధీర్ తెలిపారు. కావును రైతులు, వినియోగదారులు లందరూ గమనించి, సహకరించగలరని కోరారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలం నర్మెట గ్రామ పద్మశాలి సంఘం ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. రెండు ఏళ్ల పాటు ఉండే ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా తాళ్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా తాళ్ళ నర్సయ్య, కార్యదర్శిగా సాదుల బలేషం, ఉపాధ్యక్షులుగా గంగిశెట్టి శ్రీనివాస్, తాళ్ళ మణెవ్వ, కార్యవర్గ సభ్యులుగా కుచన్ విక్రం, గంగిశెట్టి వేణు, తాళ్ల కరుణ, కొంక బాలరాజు, బొజ్జ శంకరయ్య, సాధుల లక్ష్మణ్, గౌరవ సలహా మండలి సభ్యులుగా వడ్లకొండ నాగభూషణం, తాళ్ల బాల దుర్గయ్య, తాళ్ల సత్యనారాయణ, తాళ్ల చక్రపాణి, ఆడిట్ కమిటీ సభ్యులుగా తాళ్ళ మార్కండేయ, పుట్ట భాస్కర్, కొంక బాలరాజు తదితరులు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి

నవతెలంగాణ-గజ్వేల్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ తెలిపారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టి ప్రభుత్వాన్ని పార్టీని ప్రజల మన్నలు పొందేలా చేశారని ఆయన అన్నారు. రైతులకు వైయస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రుణమాఫీ జరగగా తిరిగి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండోసారి రైతులకు రుణమాఫీ జరిగిందని రైతులు చెప్పుకోవడం కనిపిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎంతో ఉపయోగంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించి పథకాన్ని తీసుకొచ్చారన్నారు.గజ్వేల్ నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు బలోపేతం అవుతుందని ఆయన చెప్పారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కళాశాలలో ఇంగ్లీష్(1), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ (1) అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. జీవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు 12 సెప్టెంబర్, సాయంత్రం 4 గంటల లోపు కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు. పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులు, సంబంధిత సబ్జెక్టులో పీహెచ్ డీ లేదా నెట్ లేదా సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. బోధనానుభవం ఉన్న అభ్యర్థులకు వెయిటేజీ ఇవబడు తుందని, అభ్యర్థులను 13 సెప్టెంబర్ న ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) సిద్దిపేట లో డెమో, మౌకిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు. అదనపు సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

నవతెలంగాణ-గజ్వేల్



కురుస్తున్న భారీ వర్షాలకు గజ్వేల్ నియోజకవర్గంలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని గజ్వేల్ మండల బీజేపీ ఉపాధ్యక్షులు బారు అరవింద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పక్షం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్కజొన్న, వరి ఇతర పంటలు నష్టపోయినట్లు చెప్పారు. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదిక పంపించి, ఎకరాకు 20వేల చొప్పున ఇచ్చి ఆదుకోవాలని కోరారు. రైతులు పెట్టుబడి పెట్టి ఎంతో ఆశగా చూసినా అతివృష్టితో నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి రూ.13వేల కోట్లను సహాయం అందించిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకునేలా కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని చేబర్తి గ్రామానికి చెందిన గుర్రాల అంజనేయులుకు రూ. 35 వేల సీఎం సహాయ నిధి చెక్కును సోమవారం మాజీ జెడ్పీటీసీ యెంబరి రామచంద్రం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చేబర్తి అజీ సర్పంచ్ ఎర్రబాగు ఆశోక్, మాజీ ఉపసర్పంచ్ గుర్రాల స్వామి, మాజీ రైతు బంధు అధ్యక్షులు జాలని బాల నర్సయ్య ,అత్మ కమిటీ మాజీ డైరెక్టర్ బబ్బూరి రాములు గౌడ్,నాయకులు, గ్రామస్థులు, తదితరులున్నారు.

అనారోగ్యంతో సీపీఐ(ఎం)కార్యకర్త సతీమణి మృతి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి సీపీఐ(ఎం)గ్రామ శాఖ సభ్యుడు కత్తుల నర్సింహారెడ్డి సతీమణి బాలవ్వ (50) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి సోమవారం మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, మండల కమిటీ సభ్యులు బోయిని మల్లేశం, గొర్రె శ్రీనివాస్, దర్శనం రమేష్, పొనుగోటి శ్రీనివాస్ రెడ్డి, గర్నపెల్లి చంద్రం, పాల వెంకటేశం, పోరెడ్డి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్,, డ్రాయింగ్ పెన్సిల్స్ అందజేత



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని నాగపురి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న అందె విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం ఆంగ్లంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలికట్టె అయిలయ్య చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్స్,డ్రాయింగ్ పెన్సిల్స్,పెయింటింగ్ కలర్స్, కంపాక్స్ బాక్స్ అందజేశారు. విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సస్తున్న అందె విజయ్ కుమార్ ను ప్రధానోపాధ్యాయుడు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఇటీవల తండ్రి చనిపోయిన నిరుపేద పదవ తరగతి విద్యార్థిని బుచ్చెల్లి అమృత (నాగపురి ఎస్సీ కాలనికి చెందిన)ను ఉన్నత చదువులు చదివించేందుకు విజయ్ కుమార్, అమల దంపతులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగుల పాలిట శాపంగా మారిన ప్రభుత్వ ఆసుపత్రి

- చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు డాక్టర్లు వైద్యం అందించని పరిస్థితి
- సమస్యలకు నిలయంగా ఆసుపత్రి

నవతెలంగాణ-చేర్యాల

పేద ప్రజలకు ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తారు. అదే ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారితే ఎక్కడికి వెళ్ళాలో తెలియని పరిస్థితి. ఇటువంటి పరిస్థితే చేర్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొంది. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్న తరహాలో ప్రభుత్వ ఆసుపత్రి తయారైంది. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు సైతం ఆసుపత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు సరైన వైద్యం అందించని పరిస్థితి నెలకొంది. చేర్యాల డివిజన్ పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్నటువంటి చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారుతోంది. ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది లేకపోవడంతో చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు సైతం ప్రయివేట్ ఆసుపత్రులకు లేదా జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏదైనా అత్యవసర ఆరోగ్య సమస్య ఏర్పడితే విధుల్లో ఉన్న డాక్టర్లు కేవలం ప్రాథమిక చికిత్స అందించి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఏదైనా ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్ళమని సూచిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో కనీసం రెగ్యులర్ డాక్టర్లు లేకపోగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు తూతూ మంత్రంగా డ్యూటీలకు హాజరవుతూ విధులు నిర్విస్తున్నారు.

డాక్టర్లు ప్రయివేటు విధులు నిర్వహణ

ఇదే ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పలువురు డాక్టర్లు ప్రయివేటు ఆసుపత్రులు నిర్వహిస్తుండడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం నిర్వహించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయివేట్ ఆసుపత్రులు నడుపుతున్న డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రిలో తమ డ్యూటిల సమయాల్లో కూడా ఓపీ పేషెంట్లను వదిలి తమ ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి అక్కడి రోగులకు చికిత్స అందించి తిరిగి విధులకు వస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.




గర్భిణీలకు ట్రైనీ డాక్టరు

మరోవైపు ఆసుపత్రిలో గత కొంత కాలంగా సూపరిండెంటుగా, గైనకాలజిస్టుగా విధులు నిర్వహించిన డాక్టర్ స్రవంతి మరో ప్రాంతానికి బదిలీ కావడంతో ప్రస్తుతం సూపరిండెంటుతో పాటు గైనకాలజిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతీ సోమవారం, శుక్రవారం గర్భిణీ స్త్రీలకు వైద్య చికిత్సలు నిర్వహించి బుధవారం రోజున డెలివరీలు చేస్తుం టారు. కాగా ప్రస్తుతం గైనకాలజిస్ట్ లేకపోవడంతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రస్తుతం పీజీ విద్యను అభ్యసిస్తున్న ట్రైనీ డాక్టరుతో విధులు నిర్వహిస్తున్న పరిస్థితి. కనీస అనుభవం లేని విద్యార్థినిని గైనకాలజిస్ట్ డాక్టరుగా భాద్యతలు అప్పగిస్తే డెలివరీ చేసే సమయంలో గర్భిణీ స్త్రీలకు జరగరాని సమస్య ఏదైనా జరిగితే బాధ్యత ఎవరు వహించాలని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతంత మాత్రంగా ఓపీ సేవలు, పట్టించుకోనని రెగ్యులర్ డాక్టర్

మరోవైపు ఓపీ సేవలు నిర్వహించే డ్యూటీ డాక్టర్లు వివిధ కారణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులను సమస్య అడిగి మందులు రాయడం తప్ప నాడి వ్యవస్థ పరిశీలించడం, కనీసం స్టెతస్కోపును సైతం ఉపయోగించడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఈ ఆసుపత్రిలో వున్న ఏకైక రెగ్యులర్ డాక్టర్ రోగులను కనీసం పట్టించుకోడని, రోగులపై చిరాకు పడతాడని ఆరోపిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల పరిస్థితి ఇలా ఉంటే మరోవైపు ఆసుపత్రిలో రక్త పరీక్ష చేసిన తర్వాత ఇంటర్నెట్ సెంటర్లలోకి వెళ్లి రిపోర్ట్ తీసుకుని రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలోనే రిపోర్ట్ ఇవ్వాలని అడిగితే ఇంటర్నెట్ రావడం లేదని, ప్రింటర్ పనిచేయడం లేదని, పేపర్లు లేవని పలు సాకులతో రోగులతో పాటు గర్భిణీ స్త్రీలను సైతం బయటకు పంపిస్తున్నారని రోగుల కుటుంబ సభ్యులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి రూ.వేల వెచ్చించి చికిత్స తీసుకునే స్థాయి లేని నిరుపేద ప్రజలకు డాక్టర్ల కొరత శాపంగా మారే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, వైద్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్లను నియమించడంతో పాటు డిజిటల్ ఎక్స్ రే, బ్లడ్ టెస్ట్, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ టెస్ట్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి



అధికారుల పర్యవేక్షణ లోపం,రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి అధ్వానంగా తయారైంది.. చేర్యాల డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు పెద్ద దిక్కైన చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారుతుంది. చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్లతో పాటు రెగ్యులర్ గైనకాలజిస్ట్,స్టాఫ్ నర్స్,సిబ్బందిని నియమించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

కొంగరి వెంకట మావో
సీపీఐ(ఎం)చేర్యాల మండల కార్యదర్శి

రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి



చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ డాక్టర్లు లేకపోవడంతో వైద్య చికిత్సల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు అందించడంతో పాటు రెగ్యులర్ డాక్టర్లను నియమించాలి.

రామగళ్ల నరేష్
సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు
చేర్యాల

మహిళలపై జరుగుతున్న హింసను, లైంగిక వేధింపులను అరికట్టాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, పని ప్రదేశాల్లో వేధింపులను ఆపాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులతో కలిసి సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల మూలంగా మహిళలపై రోజురోజుకు అఘాయిత్యా దాడులు పెరుగుతున్నాయని వీటిని అరికట్టడంలో రెండు ప్రభుత్వాలు విఫలం చెందాయ ని అన్నారు. ఆనాడు మహనీయులు అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా తిరిగినప్పుడే నిజమేనా స్వాతంత్రం అని అన్నారు. కానీ నేడు పట్టపగలే తిరగలేని పరిస్థితి ఈ సమాజంలో ఉందని వాటి గల కారణాలు ఈ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలని అన్నారు. అనేక చట్టాలు తీసుకొస్తున్నప్పటికీ వాటిని పకడ్బందీగా అమలు చేయకపోవడం మూలంగానే నిర్భయ చట్టంతో మొదలై నేడు పసిపిల్లల ప్రాణాలను తీసే వరకు అనేక చట్టాలు వచ్చిన వాటిని పకడ్బందీగా కఠినంగా అమలు చేయడంలో లోపం ఉండడంవల్ల నేరస్తులు సజావుగా బయట తిరుగుతున్నారని ఇలా ఉండడం కారణంగానే ఇలాంటి అత్యాచారాలు అఘాయిత్యాలు చేసి దర్జాగా కాలు మీద కాలేసుకుని ఉండొచ్చని అపోహలు సమాజానికి అందిస్తున్నట్టుగా ఈ ప్రభుత్వ పోకడలు కనిపిస్తున్నాయి. కాబట్టి అత్యాచారం హత్యలు జరిగిన జరిపిన వారిపై కఠినంగా వ్యవహరించి శిక్షించాలని కోరారు. లేనిపక్షంలో మహిళా కార్మికులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గుంతల మయమైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- నిలిచిపోయిన బస్సును పున: ప్రారంభించాలి
- సీపీఐ (ఎం)ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం చుంచనకోట, వీరన్న పేట గ్రామాల మధ్య గుంతల మయంగా మారిన మూడు కిలోమీటర్ల మట్టి రోడ్డు కు వెంటనే మరమ్మతులు చేపట్టి బస్ సర్వీస్‌ను పున్హ ప్రారంభించాలని సీపీఐ(ఎం)చేర్యాల మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బస్ సర్వీస్ ను పునర్ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జూనియర్ అసిస్టెంట్ ముదాసీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు కిలోమీటర్లు మట్టి రోడ్డు గత పది ఏళ్ల కాలంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రోడ్డంతా గుంతల మయం అయిందని, రోడ్డుకు ఇరు ప్రక్కల ముళ్ళ చెట్లు పెరిగి అంతరాయంగా మారిందని దీని కారణంగా వీరన్న పేట నుంచి చుంచనకోట మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సు సర్వీస్ నిలిచిపోయిందని దీనితో చుంచనకోట ప్రజలకు అసౌకర్యంగా మారిందని అన్నారు. ఈ రోడ్డు వెంట ప్రయాణించే బాటసారులకు, వాహనదారులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టి నిలిచిపోయిన బస్సు సర్వీస్ ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ చుంచనకోట గ్రామ శాఖ కార్యదర్శి పండుగ యాదగిరి, బింగి వెంకటయ్య, బింగి మహేష్, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పై అవగాహన

నవతెలంగాణ-మిరుదొడ్డి



మిరుదొడ్డి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బాలల రక్షణ సంరక్షణ పై 1098 వాల్ పోస్టర్ వేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం నుంచి బాయికాడి లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ రైట్స్ గుడ్ టచ్ ,అండ్ బ్యాడ్ టచ్ ,సెల్ఫ్ అవేర్నెస్ బాల కార్మికులు కనబడిన హెల్ప్ లైన్ కి కాల్ చేయాలని సూచించారు. అనంతరం చైల్డ్ మ్యారేజ్ గురించి పిల్లలకి అవగాహన జీరో 0 నుంచి 18 ఏళ్ల గల బాల బాలికల యొక్క రక్షణ ,సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ పనిచేస్తుందని అన్నారు. వివిధ రకాల సంబంధించిన అనాధ పిల్లలు ,స్కూల్ డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ , బాలల అబ్యూజ్ ,బాల కార్మికులను బడిలో చేర్పించడం మొదలగు కార్యక్రమలు నిర్వహిస్తామని తెలిపారు.పిల్లలను అవసరం లేని వారు చట్టపరంగా దత్తత ఇవ్వాలని, పిలల్లు అవసరం ఉన్నవాళ్లు చట్టపరంగా దత్తత తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి దేవి, పాల్గొన్నారు.

పలు వార్డుల్లో పర్యటించిన కమిషనర్

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని 28 వ వార్డులో కౌన్సిలర్ కె.మల్లికార్జున్ తో కలిసి మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ వార్డులో పర్యటించారు. వార్డులో మురికి కాలువ పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, చీదు తొలగించాలని, మురికి కాలువ పైభాగాన ఉన్న మట్టిని సైతం తొలగించాలని, లేదంటే నీరు నిలిచిపోతుందన్నారు. మట్టి, రాళ్ల కుప్పలను తొలగించాలని లేదంటే పాములు, విష కీటకాలు, దోమలు ఆవాసం చేసుకుంటాయని, సిబ్బందిని ఆదేశించారు. బాల సదనం లో వర్షపు నీరు నిలిచిపోవడం గమనించిన కమిషనర్ వెంటనే నీరు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ లోకి వెళ్ళేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు బజార్ లో సదర్శించారు. మార్కెట్ లో వెలువడే తడి చెత్త ద్వారా తయారయ్యే బయో గ్యాస్ ప్లాంట్ నీ తిరిగి వాడుకలోకి తీసుకురావాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్ లో కంపోస్టు పిట్ ఏర్పాటు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జర్నలిజం ముసుగులో బెదిరిస్తే సహించం

- నిజమైన జర్నలిస్టుల జోలికొస్తే ఊరుకోం



నవతెలంగాణ-సిద్దిపేట

జర్నలిజం ముసుగులో బెదిరిస్తే సహించమని, నిజమైన జర్నలిస్టుల జోలికొస్తే ఊరుకోమని సిద్దిపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కలకుంట్ల రంగాచారి అన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రధాన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ఒకవైపు తన పాత్ర నిర్వహిస్తుండగా, రోజురోజుకు విస్తరిస్తున్న సోషల్ మీడియా కుడా మీడియా రంగంలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్నదనీ, అయితే సోషల్ మీడియాలోని కొన్ని సంస్థలు, వ్యక్తులు జర్నలిజాన్ని భ్రష్టు పట్టించే చర్యలకు పాల్పడుతున్నారనీ అన్నారు. ఇది సమా జాన్ని చెడు వైపు నడిపిస్తున్నదనీ, జర్నలిస్టుల విలువలను దిగజార్చుతున్నాయనీ, ఇది సమాజానికి, పత్రిక, మీడియా స్వేచ్ఛకు మంచిది కాదనీ అన్నారు. పత్రిక, మీడియా స్వేచ్ఛ ముసుగులో కొందరు వ్యక్తులు, సంస్థలు బరితెగించి వ్యవహరిస్తున్నారనీ, తమ వ్యక్తిగత ప్రయో జనాల కోసం వ్యాపారులను, వివిధ సంస్థలను, ప్రభుత్వ, ప్రైవేటు వారిని బ్లాక్మెయిల్ చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారనీ, ఇది నిజమైన జర్నలిజం కాదనీ అన్నారు. అలాగే ఇది జర్నలిస్టులకు ఉండాల్సిన లక్షణం ఎంత మాత్రం కాదనీ, ఇటీవల సిద్దిపేటలో కొందరు వ్యక్తులు సంస్థలు జర్నలిజం ముసుగులో బెదిరింపులకు పాల్పడుతున్నారనీ అన్నారు. ఈ వ్యవహారాన్ని మేము జర్న లిస్టులుగా తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి వ్యక్తులు, సంస్థలు జర్నలిజానికి పనికిరారనీ అన్నారు. బెదిరిం పులకు పాల్పడి, వ్యక్తుల సమాచారాన్ని సిద్దిపేట ప్రెస్ క్లబ్ లేదా జర్నలిస్ట్ సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎవరైనా చట్ట పరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా జర్నలిస్టు వృత్తిని నిబద్ధతతో నిర్వహిస్తూ సమాజంలో మంచి, చెడును బహిర్గతం చేస్తున్న నిజమైన జర్నలిస్టుల పై ఎవరు దాడులు, బెదిరింపులకు గురిచేసిన చూస్తూ ఊరుకోమనీ, వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారూ. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు హరిపురం రఘునందన్ స్వామి, దూది దుర్గారెడ్డి, బబ్బురి రాజు, నాయిని సంజీవరెడ్డి, మజ్జు, మాడూరి శ్రీరామ్, రంగదాంపల్లి శీను, అయిత శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడం సమంజసం కాదు

నవతెలంగాణ-నంగునూరు



ఎస్సీ వర్గీకరణను మాల మహానాడు నేతలు అడ్డుకోవడం సమంజసం కాదని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జి దేవులపల్లి రాజేందర్ అన్నారు. సోమవారం నంగునూరు మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాల మహానాడు పేరు మీద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకత పోరాట సమితి ప్రకటించడం పట్ల ఆయన తీవ్రంగా ఖండించారు. ఎస్సీ 59 కులాల ఎవ్వరి వాటా వారికి, జనాభా దామాషా ప్రకారంగా వారికి పంపిణీ జరిగిన రోజు సమానత్వం లేకుండా ఐక్యత కోరుకోవడం న్యాయం కాదన్నారు. వర్గీకరణ పై వ్యతిరేక పోరాటాలు కాకుండా ఐక్యత పెంచుకుందామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను అమలు చేసుకుందామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకై పోరాటానికి సిద్ధ మవుదామన్నారు. రిజర్వేషన్ల జనాభా దామాషా ప్రకారంగా పెంచాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై యుద్ధానికి సిద్ధం కావడానికి కలిసి రావల సిందిగా మాల మహానాడు నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లింగాల నర్సింలు, మండల అధికార ప్రతినిధి దేవులపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు దేవులపల్లి కనకయ్య పాల్గొన్నారు.

అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలు సందర్శన

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో అధిక వర్షాలకు దెబ్బతి న్న పత్తి పంటలను జిల్లా వ్యవసా య అధికారి టి. రాధిక సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు నల్ల రేగడి భూముల్లో పత్తి పంటలో నీరు నిలిచి వేర్లకు గాలి అందక మొక్కలు వాడిపోవడం జరుగుతు ందన్నారు. అలాగే తెగుళ్ల ఎక్కువ వచ్చే అవకాశం ఉందని వాటిని నివారించుటకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కలు మొదలు తడిచేటట్టు పోసుకోవాలని అన్నా రు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్ట నష్టం జరిగిన రైతుల వివరాలను అధికా రుల ద్వారా సేకరించి ప్రభు త్వానికి పంపి ంచటం జరుగుతుందని తెలిపారు. జగదేవ పూర్, ముని గడప గ్రామాల్లోని ఎరువులు దుకాణా లను ఆకస్మిక తనిఖీ చేసి ఎరువుల నిల్వలను ఈపాస్ మిషన్‌లోని నిల్వలతో పోల్చి చూశారు. జిల్లాలోని డీలర్లు ఈపాస్ మిషన్ ద్వారా ఎరువుల అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవ సాయ అధికా వసంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారి ఖలీల్, రైతులు పాల్గొన్నారు

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్ కుమార్ గౌడ్ ను సోమవా రం దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి టీపీసీ సీ అధ్యక్షుడు ను హైదరాబాదులో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు అనంతరం పులా బొకేతో శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షుడు ను కలిసిన వారిలో సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణ, సుప్రభాతారావు, డీసీసీ అధ్యక్షులు తుముకుంట నర్సరెడ్డి, దుబ్బాక నియోజక వర్గ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), విజయ్ పాల్ రెడ్డి, వెంగళరావు, సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి తో కలిసి అర్జిదారుల నుంచి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జిదారులు ఎంతో ఆశతో కార్యలయంకి వస్తారని వారందరికీ న్యాయం చేయడం అధికారులుగా మన కర్తవ్యం అని జిల్లా అధికారులకు తెలిపారు. అర్జిదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలి. అర్జిదారులకు ప్రజావాణి కార్యక్రమం పైన నమ్మకం పెరిగిందని క్రమక్రమంగా అర్జిదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహం తో పనిచేయ్యాలన్నారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇండ్లు, ఆసరా పింఛన్లు, ఇతరత్రా మొత్తం కలపి 33 దరఖాస్తులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన టీపీసీసీ అధ్యక్షుడిని సన్మానించిన పూజల హరికృష్ణ



నవతెలంగాణ-సిద్దిపేట

నూతన టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ నియామకం అయిన సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరిక్రిష్ణ హైదరాబాద్‌లో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ను ప్రజల్లోకి తీసుకెళ్ళి, అవగాహన కల్పించాలని మహేష్ కుమార్ గౌడ్ కోరినట్లు తెలిపారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ గుర్తింపు గుర్తింపు ఇస్తుందనీ, మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో రాష్ట్ర లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందనీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖలీముద్దీన్, బొమ్మలు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని తలారివాని పల్లి గ్రామ పంచాయతీలోని ఒడ్డెరపల్లిలో స్థానికుడు సురేష్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 100 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అదివారం టాస్క్ ఫోర్స్ అధికారులు బెజ్జంకి పోలీసులతో కలిసి పట్టుకున్నారు. చట్టపరమైన చర్యల నిమిత్తం సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించినట్టు సోమవారం టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

పరిస్థితి విషమించి వృద్ధుడి మృతి

- క్రిమి సంహారక మందు సేవించి ఆత్మహత్యయత్నం



నవతెలంగాణ-బెజ్జంకి

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బద్దం రాజిరెడ్డి(75)అనారోగ్య కారణాలతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. అనారోగ్యంతో మనస్తాపం అదివారం క్రిమిసంహారక మందు సేవించి అత్మహత్యయ్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య గంగవ్వ, కుమారుడు రవీందర్ రెడ్డి మేరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని కుమారుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో పంట వర్కర్ పోస్ట్ ఖాళీ

- అర్హులైన వారు దరఖాస్తు చేసుకోగలరు
- ఎంఈఓ ప్రభుదాస్

నవతెలంగాణ-మిరుదొడ్డి

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మిర్దొడ్డి నందు సహాయ వంటమనిషి పోస్ట్ ఒకటి ఖాళీగా కలదు. మండల కేంద్రంలో ఉన్న పాఠశాలలో వంట మనిషికి అర్హత ఏడవ తరగతి చదివి, మిడిదొడ్డి గ్రామస్తులు, మహిళలు అయి ఉండాలి. ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు స్పెషల్ ఆఫీసర్ విద్యాలయం వద్ద దరఖాస్తు సమర్పించాలి. ఆసక్తి ,అర్హత కలిగిన వారు దరఖాస్తు వెంట 7వతరగతి చదివిన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్ పోర్టు సైజ్ ఫొటో సమర్పించాలి.

హైదరాబాద్ బేగంపేటలో రాష్ట్రస్థాయి ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ప్రభుత్వం ప్రజల అర్జీలను స్వీకరించేందుకు, ప్రతీ మంగళవారం, శుక్రవారం మహాత్మ జ్యోతి బా పూలే ప్రజా భవన్, బేగంపేట, హైదరాబాద్ నందు రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో మహాత్మ జ్యోతి బా పూలే ప్రజా భవన్‌లో నిర్వహించబడే ముఖ్యమైన సమావేశాల కారణంగా మంగళవారం నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం బుధవారానికి వాయిదా వేశారని, బుధవారం ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కొనసాగిన ఐసెట్ ధ్రువపత్రాల పరిశీలన



నవతెలంగాణ-నంగునూరు

ఎంబీఏ,ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్‌లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపల్ ఎ.గోవర్ధన్ తెలిపారు. వెరిఫికేషన్ కు అన్ని సర్టిఫికేట్ లు ఒరిజినల్ చూపిస్తూ ఒక జిరాక్స్ సెట్ సమర్పించాలని అన్నారు. ధృవప త్రాల పరిశీలనకు 302 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సఫాయి కొమురయ్యను మరువలేం



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట గ్రామపంచాయతీ ఏర్పడిన నాటి నుంచి గ్రామ సఫాయిగా సేవలందించిన మంద కొమరయ్య సేవలను మరువలేమని తాజా మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం కొమరయ్య మృతదేహానికి నివాళులు అర్పించాడు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో చాలీచాలని జీతం తీసుకుంటూ గ్రామ పరిశుభ్రత విషయంలో ఎంతో సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. అనారోగ్యం కారణంగా ఆయన మరణించడం బాధాకరమని అన్నారు.

తప్పిపోయిన పాపను పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన చెవిటి రాజు నాలుగేళ్ల కూతురు శ్రీ నిత్య సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తప్పిపోవడంతో కూతురు తండ్రి పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించారు. ఎస్ఐ పీ.నీరీష్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ ఆర్.రవి ఆసుపత్రి వద్ద సీసీ కెమెరాల ద్వారా చుట్టుపక్కల వీధుల్లో తప్పిపోయిన పాపను వెతికి పట్టుకొని సురక్షితంగా తల్లిదండ్రులకు పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు ఎస్ఐ,కానిస్టేబుల్ కు కృతజ్ఞతలు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లు



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షానికి సుమారు 11 పెంకుటిల్లు పాక్షికంగా కూలినట్లు మర్కుక్ తహసీల్దారు అరిఫా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఇటీవల కురిస్తున్న వర్షానికి పెంకుటిల్లలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాక్షికంగా కూలిన ఇండ్లలో నివసిస్తున్నవారు ప్రత్నామ్యాయంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మర్కుక్ , పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు బాధితులకు పలు సలహాలు సూచనలు చేశారు.

నేడు దూళ్మిట్ట మండలంలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలో నేడు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 33 కెవి దూళ్మిట్ట లైన్ లో చెట్లు తొలగించేందుకు విద్యుత్ అంతరాయం ఉన్నట్లు ఏఈ శ్రీనివాసరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను తొలగించేందుకు. దూళ్మిట్ట, బెక్కల్, బైరాన్ పల్లి, సబ్ స్టేషన్ పరిధిలో సింగల్ ఫేస్, త్రి ఫేస్, విద్యుత్ సరఫరా ఉండదని అని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి రైతులు, ప్రజలు, సహకరించాలని ఆయన కోరారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన బయ్యారం

నవతెలంగాణ-గజ్వేల్

తనకు జన్మనిచ్చిన గ్రామాన్ని గజ్వేల్ చిత్రపటంలో పెట్టాలని తపనతో గ్రామానికి సర్పంచ్ ఎన్నికై గ్రామ అభివృద్ధికి కృషిచేసిన మాజీ సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డికి గ్రామ ప్రజలు అభివృద్ధి విషయంలో వెన్నంటు ఉన్నారు. పుట్టిన గ్రామం పై మమకారాన్ని అంతా ఇంతా కాదు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించారు. అప్పటి ప్రభుత్వం కృషితో రూ.కోట్లాది నిధులు తీసుకొచ్చి పుట్టిన గడ్డ పై ఆయన మమకారాన్ని అభివృద్ధి రూపంగా చూపించారు. గతంలో అభివృద్ధి అంటే ఏమిటో ఆ గ్రామానికి తెలియదు.

గ్రామపంచాయతీగా బయ్యారం ఆవిర్భం నుంచి చాలామంది సర్పంచులు ఎన్నికయ్యారు. ఈ స్థాయిలో అభివృద్ధి మాత్రం చేయలేకపోయారని గ్రామ ప్రజలు చర్చించుకోవడం కనిపిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి కృషితో బయ్యారం గ్రామాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించారు. గజ్వేల్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారం గ్రామంలో అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ రూపు రేఖలు మారాయి. గజ్వేల్ పట్టాణానికి కిలోమీటుర్ల దూరంలో ఉన్న అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. సీఎం కేసీఆర్ రాకతో గ్రామ రూపు రేఖలు మారడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ కనిపించని అభివృద్ధి ఫలాలు ప్రస్తుతం అన్నివర్గాల ప్రజలకు కండ్ల కనిపిస్తుండడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని బయ్యారం గ్రామంలో అభివృద్ధి ఫలాలు ప్రజల కనిపిస్తున్నాయి. దీంతో అన్నివర్గాల ప్రజలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెపట్టిన అభివృద్ధితో ప్రజలు



సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఉండేలా కుల సంఘాల భవనాలను, ప్రభుత్వ పాఠశాల అదనపు గదులను, అంగన్వాడీ కేంద్రం, ప్రతి గల్లీలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో రోజు ఇంటింటికి చెత్త సేకరణ, శుద్ధి చేసిన మిషన్ భగీరథ మంచినీటి పంపిణీ, చౌరస్తా నుంచి గ్రామంలోని రెండు వరుసల రోడ్డు నిర్మాణం, హరితహారంలో మొక్కల పెంపకం చేపడుతున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ఇటీవల ఎన్నికల ముందు గత ప్రభుత్వంలో ఉన్న మంత్రి హరీశ్ రావు చేతుల మీదుగా అభివృద్ధి పనులను ప్రారంభించారు.

అభివృద్ధి పనులు ఇలా ఉన్నాయి.

గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.కోటితో ఫంక్షన్ హాల్, రూ.15 లక్షలతో గ్రంథాలయం, రూ.28 లక్షలతో అంబేద్కర్ భవనం, రూ.28 లక్షలతో కురుమ కమ్యూనిటీ భవనం, రూ.8 లక్షలతో సిటిజన్ భవనం, మరో రూ.8 లక్షలతో డిజిటల్ తరగతులు గదులు, రూ.45 లక్షలతో గ్రామంలో గల్లి గల్లికి సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. గజ్వేల్ నుంచి బయ్యారం వరకు రూ.1.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణపు నిధులు మంజూరయ్యాయి. బయ్యారం గజ్వేల్ మధ్యన కల్వర్టు బ్రిడ్జి పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తారు. ఇటీవల రూ.15 లక్షలతో రెడ్డి భవనం, పంచాయతీ భవనానికి అదనంగా మరో రూ.15 లక్షలు, ఫంక్షన్ హాల్ ప్రహరీ గోడ కోసం మరో రూ.5 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. మరిన్ని అభివృద్ధి పనులు గ్రామంలో పూర్తయ్యాయి. రూ.కోట్లాది అభివృద్ధి పనులు పూర్తికావడంతో బయ్యారం అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని చెప్పాలి.

నన్ను గెలిపించినందుకు రుణం తీర్చుకున్న

గ్రామంలో నన్ను సర్పంచిగా గెలిపించినందుకు అభివృద్ధి చేసి కొంత రుణం తీర్చుకున్నా. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పుడు మంత్రి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం వల్ల అభివృద్ధి సాధ్యమైంది. అదేవిధంగా గ్రామ ప్రజలు అభివృద్ధికి సహకరించడం వల్లే సాధ్యమైంది. తన హాయంలో ఈ ఐదేళ్లలో ఇంతటి అభివృద్ధికి సహకరించిన పెద్దలకు, గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు. మళ్లీ అవకాశం ఇస్తే ఈ రంగంలో ఉంటానని ఆయన చెప్పారు.



మాజీసర్పంచ్ మద్దూరు శ్రీనివాస్ రెడ్డి

భూ విస్తీర్ణం పైన ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ వేగవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో గల మర్కుక్, ములుగు, వర్గల్ మండలాల్లో ఉన్న చెరువులు, కుంటలకు సంభందించిన భూ విస్తీర్ణం పైన ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ ప్రక్రియ వేగవంతం, ఆఖరి నోటిఫికేషన్ జారి చేయడం లో సమస్యల గుర్చి హెచ్ఎండిఏ ఉన్నత స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హెచ్ఎండిఏ పరిధిలోని జిల్లాల కలెక్టర్లు, ఆయా మండల రెవెన్యూ, భూ-సర్వే, నీటిపారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హెచ్ఎండిఏ ఉన్నత స్థాయి అధికారులు మాట్లాడుతూ ఎచ్ఎండిఎ పరిధి జిల్లాలోని మండలాల్లో సర్వే చేసి గుర్తించిన చెరువులు, కుంటల భూ-విస్తీర్ణం ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించినందుకు ప్రీమినరీ నోటిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలి. అలాగే ఆఖరు నోటిఫికేషన్ లో సమస్యలు రాకుండా నీటిపారుదల, రెవెన్యూ, భూ సర్వే హిస్టారికల్ సాటిలైట్ వ్యూ మ్యాప్ లను సేకరించి పకడ్బందీగా ప్రణాళిక సిద్దం చేసి ఈ ప్రక్రియ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గరిమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలోని 3 మండలాల్లో 9చెరువులకు సంబంధించిన సమాచారం మాత్రమే పెండింగ్ లొ ఉన్నాయని మీరు చెప్పిన విధంగా వేగంగా పూర్తి చెయ్యడానికి అన్ని విధాల కృషి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గజ్వేల్ ఆర్డిఓ బన్సీలాల్, ఎడి సర్వేలాండ్ వినయ్ కూమార్, ఆయా మండల తహసీల్దార్లు, సర్వేయర్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మర్కుక్ మండల సర్వసభ్య సమావేశం

- హజరైన పీఆర్టీయూ జిల్లాఅధ్యక్షులు అదరాసుపల్లి శశిధర్ శర్మ



నవతెలంగాణ-మర్కుక్

ఉపాధ్యాయ సమస్యల పై 60 ఏళ్ల నిబద్ధతతో పనిచేస్తున్న ఉపాధ్యాయ సంఘం పీఆర్టీయునేనని ఉపాధ్యా య పీఆర్టీయూ జిల్లాఅధ్యక్షులు అదరాసుపల్లి శశిధర్ శర్మ అన్నారు. సోమవారం పీఆర్టీయు మర్కుక్ మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మర్కుక్‌లో మండల సర్వసభ్య సమావేశం శశిధర్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. మర్కుక్ పీఆర్టీయు మండల శాఖ అధ్యక్షులుగా రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మర్కుక్ మండల శాఖ, మండలంలోని ఉపాధ్యాయులు సమస్య లపై చురుకుగా పని చేస్తోందని, మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అభినందించారు. ఉపాధ్యాయులు సభ్యత్వం ఒకే సంఘానికి ఇవ్వలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మనమే కాపాడుకోవాలని, నూతన కార్యవర్గాన్ని సంఘం ప్రతిష్టతను పెంచే కార్యక్రమాలు చేయాలన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రదానకార్యదర్శి ఇంద్రసేన రెడ్డి, మాజీ ప్రదాన కార్యదర్శి పతం వెంకరాజం, మర్కుక్ మాజీ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షులు అమరనాథ్ రావు, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, మహిళా అసోసియేట్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు మహిళా ఉపాధ్యక్షులు సంధ్యారాణి, కార్యదర్శులు, వివిధ మండలాల సంఘం నాయకులు, తదితరులున్నారు.

ఉపాధి హామీపై సోషల్ ఆడిట్

- మరణించిన వ్యక్తులకు కూలీ చెల్లింపు
- చనిపోయిన కూలీకి జరగని న్యాయం



నవతెలంగాణ-అక్కన్నపేట

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఉపాధి హామీ పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని సోమవారం అక్కన్నపేట రైతు వేదికలో ఎంపీడీవో జయరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ పీడీ బాలకృష్ణ హాజరై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఉపాధి హామీ వర్క్ చేయించే అధికారులు తప్పుల తడకగా మాస్టర్స్ రాసి పేమెంట్లు చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా కేశ్ నాయక్ తండాలో చనిపోయిన వ్యక్తి కూడా పనిచేసినట్టు రికార్డు చేసి, బిల్లు చెల్లింపు జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా పని జరుగుతున్న సందర్భంలో కనీస వసతులు కూడా ఉండడం లేదని తెలియజేశారు. అంతేకాకుండా కొన్ని మస్టార్స్ ల్లో కూలీల సంతకం లేకుండానే పేమెంట్ చేశారని ఆడిట్ సందర్భంగా బయటపడింది. ఇక ఇవే కాకుండా గుడాటిపల్లి గ్రామ పరిధిలోని భూక్య లావణ్య అనే ఉపాధి హామీ కూలీ ప్రమాదవశాత్తు మరణించడంతో ఆమెకి ఇప్పటివరకు కూడా ప్రభుత్వం అందించే సాయం అందలేదు. చెక్కు బౌన్స్ అయిందంటూ అధికారులు అలసత్వం వహిస్తున్నట్టు తెలిసింది. ఇవే కాకుండా కుందన్ వానిపల్లికి చెందిన భాగ్యవ్వ అనే మహిళ 90 రోజులు పని చేస్తే ఆమె డబ్బులు అదే గ్రామానికి చెందిన మరో భాగ్యవ్వ అనే మహిళకు పడ్డాయని సభా వేదికగా ఆరోపించారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో మస్టర్ క్లోజ్ అయిన తర్వాత కూడా పనిచేయని వ్యక్తులకు హాజరు వేశారని ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా చాలా గ్రామాల్లో వికలాంగులకు వచ్చే బెనిఫిట్స్ ఇవ్వకుండా వారితో కూడా అన్ని పనులు చేయిస్తున్నారని అన్నారు. ఈ విధంగా ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్టు సభా వేదికగా అనేక విషయాలు బయటకు రావడంతో జిల్లా అధికారులు ఖంగుతిన్నారు. 2023- 2024 ఆర్థిక సంవత్సరం ఎన్ఆర్ఈజీఎస్ పిఆర్ డిపార్ట్మెంట్ కు సంబంధించి 9 కోట్ల 30 లక్షలు అక్కన్నపేట మండలానికి వచ్చినట్లు సభా వేదికగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ప్రభాకర్, ఎంపీఓ కవి కుమార్, సామాజిక తనిఖీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఛలో సిద్దిపేట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి జిల్లా కన్వీనర్ ర్యాకం శ్రీరాములు



నవతెలంగాణ-మిరుదొడ్డి, సిద్దిపేట

ఎస్సీ వర్గీకరణ మాలల దీక్షను జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకపోరాట సమితి జిల్లా కన్వీనర్

ర్యాకం శ్రీరాములు అన్నారు. సోమవారం అంబరట భూంపల్లి మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఛలో సిద్దిపేట్‌లో నిర్వహిస్తున్న మాలల దీక్షను ఆర్థిక రాజకీయ సామాజికంగా ఎస్సీలంతా కలిసే ఉండాలనీ అన్నారు. కలిస్తే నిలుస్తాం నిలిస్తే గెలుస్తాం అనే ఆలోచనతో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలు మాల అనుబంధ కులాలు అన్ని ఒక తాటి పైకి వచ్చి మాల ఐక్య కార్యాచరణ కమిటీ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 11న సిద్దిపేట పాత బస్టాండ్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీగా బయలుదేరి ముస్తాబాద్ చౌరస్తాలో దీక్ష కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి మాలలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరు హాజరుకై జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కన్వీనర్లు కన్వీనర్స్ బాధ్యులు మద్దెల నర్సింలు ,శ్రీరాములు, గుడిమల్ల సత్తయ్య. వెన్న రాజు, పాల్గొన్నారు

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మిరు దొడ్డి

అక్బర్ పేట భూంపల్లి టీపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ అక్బర్ పేట భూంపల్లి నూతన మండల శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షులు: పెరుమాండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి యాదయ్య ,ఉపాధ్యక్షులు:యమ్ శ్రీనివాస్ ,యమ్ బాలక్రిష్ణ,యస్. జనార్ధన్ ,బి.రాజేంద్రప్రసాద్,సంధ్య ,కార్యదర్శులు: బ్రహ్మాచారి,బి.నర్సింలు,యన్ .నరేష్,.నాగమణి,సంతోష జిల్లా కౌన్సిలర్స్:కర్ర కనకయ్యగడ్డం రాము, బైరారెడ్డి అకాడమిక్ సెల్ కన్వీనర్ :యన్ సత్యనారాయణ రెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా ర్యాకం మల్లేశం జిల్లా కార్యదర్శి, పరిశీలకులుగా జి. శివాజీ జిల్లా కార్యదర్శి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ పునరుద్దించాలని అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులకు బీఈడీ అర్హత ఉన్న వారిని పరిగణించాలని, అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని అన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏవో



నవతెలంగాణ-రాయపోల్

భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో వర్షాలకు దెబ్బతిన్న, నీట మునిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు చాలా వరకు దెబ్బతిన్నాయని, వర్షాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించడం జరిగిందన్నారు. మండల పరిధిలో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్ట వివరాలను నమోదు చేయాలని ఏఈఓలకు సూచించారు. పంట నష్టం జరిగిన రైతులు సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ప్రవీణ్, రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించాలి



నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వ పాఠశాల పట్ల నిర్లక్ష్య వైఖరి తగదని, ప్రాథమిక పాఠశాలలు విద్యా వ్యవస్థకు పట్టు కొమ్మలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి అన్నారు. నంగునూరు మండల అధ్యక్షులు జైపాల్ యాదవ్ అధ్యక్షతన కార్యదర్శి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి మాట్లాడుతూ గతంలో ప్రకటించిన 5వేల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంటనే నియమించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి పబ్బతి శ్రీనాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ఏకోపాధ్యాయుల నియామకం అన్నది విద్యార్థులను వారి విద్యా హక్కుకు దూరం చేయడమేనని అన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ వెంటనే స్పందించి విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కరువు బత్యాలను వెంటనే ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా పీఆర్సీ కాలయాపన లేకుండా ప్రకటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, రాం రెడ్డి, పరశురాములు జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలను పరిశీలించిన చేర్యాల సీఐ



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను చేర్యాల సీఐ ఎల్ శ్రీను, సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల దగ్గర నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. గణేష్ మండపాల వద్ద విద్యుత్ కలెక్షన్ కొత్త వైర్లతో తీసుకోవాలని తెలిపారు. గణేష్ నిమజ్జన సమయంలో డీజే లు పెట్టవద్దని కోరారు. డిజేలు పెడితే డీజే లను సీజ్ చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎస్సై షేకమహబూబ్, ఏఎస్ ఐ జిల్లా జగదీష్, కానిస్టేబుల్ సిద్ధార్థ, ఉన్నారు.

ధర్మ రెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద తేలిన ఐరన్ స్టీల్





నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణం నుంచి చేగుంటకు వెళ్లి దారిలో ధర్మ రెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డుపైన ఐరన్ స్టీల్ రాడ్ తేలడంతో ప్రమాదకారంగా మారింది. ఈ రోడ్డు మార్గంగా చేగుంట-గజ్వేల్ మధ్యన ప్రజలు ప్రయాణికులు రాత్రింబ వలు రాకపోకలు సాగిస్తారు. గజ్వేల్ చేగుంట మధ్యన పలు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం పూట ఎంతో కొంత కనిపించిన రాత్రి వేళలో ఈ రోడ్డులో ఐరన్ స్టీల్ రాడ్ కనిపించని నేపథ్యంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డు నాణ్యత ప్రమాణాలు పాటించే లేదని దీని ద్వారా స్పష్టమవుతుంది. సంబంధిత శాఖ అధికారులు రోడ్డు నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యవేక్షణ కరువైం దని తెలుస్తుంది. సంబంధిత రోడ్డు భవనాల శాఖ అధికా రులు తక్షణమే చర్యలు తీసుకొని రోడ్డును బాగు చేయాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హైడ్రాను రాజకీయాలకు కాకుండా జాతీయ ప్రయోజనాలకు ఉపయోగించండి

- ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సుప్రీం కోర్ట్ జడ్జిమెంట్ ప్రకారం బఫర్ జోన్, చెరువుల శిఖం భూముల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండవద్దని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రాను రాజకీయాలకు కాకుండా జాతీయ ప్రయోజనాల కోసం ఉపయోగించాలని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు కోరారు. బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభ కార్యక్రమం సోమవారం పట్టణంలోని ఎన్జీవోస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను కూల్చుతున్నప్పుడు రాజకీయాలను, రంగులను చూడకుండా, జాతీయ ప్రయోజనాలను చూడాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిపి నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. స్వాతంత్ర్యానికి ముందు న్యాయవాదులే ఎక్కువగా నాయకులుగా పనిచేశారని, ఇది మారుతున్న దేశ రాజకీయాలకు సంకేతమని అన్నారు. సిద్దిపేట గడ్డ నుండే మార్పు మొదలైందనీ, సిద్దిపేటలో చాలామంది న్యాయవాదులు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని అన్నారు. కొంతమంది నాయకులకి మొన్నటి ఎంపీ ఎన్నికలు కనువిప్పు కలిగించాయనీ అన్నారు. ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలనీ కోరారు. నేషన్ ఫస్ట్, పార్టీ నెక్స్ట్, ఇండిపెండెంట్ లాస్ట్ అనే సిద్ధాంతంతో ఉన్న పార్టీ బీజేపీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, నరేష్, ఉపేందర్, శంకర్, భూపతి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుక గౌడ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ -గజ్వేల్

మోకుదెబ్బ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుక గౌడ్ పుట్టినరోజు శుభాకాంక్షలు సందర్భంగా కేక్ కట్ చేసినట్లు కొమ్ము ఉమేష్ యాదవ్ తెలిపారు. సోమవారం గజ్వేల్ పట్టణంలో ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించారు. సిద్దిపేట జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు కొమ్ము ఉమేష్ యాదవ్ మాట్లాడుతూ రేణుక గౌడ్ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. బీసీ సంక్షేమ క్రింద ఉన్న సామాజిక వర్గాల అందరికీ న్యాయం జరగాలని రేణుక గౌడ్ కృషి చేస్తున్నారని తెలిపారు. మేకు దెబ్బ రాష్ట్ర నాయకత్వంలో కీలక పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గజ్వేల్ మండల్ యాదవ సంఘం అధ్యక్షుడు కోనమైన కన్న యాదవ్, ప్రజ్ఞాపూర్ రజక సంఘం ఉపాధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు వాయిదా

నవతెలంగాణ - సిద్దిపేట

వర్షాల కారణంగా 10 నుంచి జరగాల్సిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు తిరిగి ఈ నెల 19న వాలీబాల్ ,20 న కబడ్డీ ,21 న ఖోఖో , 23 న అథ్లెటిక్స్ పోటీలు జరపాలని నిర్ణయించినట్లు ఎంఈఓ యాదవ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంట్రీస్‌కి చివరి రోజు 17 అని, 18న ఉదయం 10 గంటలకు వ్యాయామ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశం, డ్రాలు తీయడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు, ఉపాధ్యాయులు గమనించాలని సూచించారు.

ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు



నవతెలంగాణ-సిద్దిపేట

ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని అరుంధతి కళ్యాణ మండపంలో సోమవారం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు , వైద్యులు, జువ్వన ప్రసాద్, ఇస్తారి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

నవతెలంగాణ-కొండపాక

పిల్లలకు పోషకాహారం ఇవ్వడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కొండపాక మండలం మర్పడగ అంగన్ వాడీ టీచర్ రాణీ అన్నారు. మర్పడగా అంగన్ వాడీ సెంటర్లో సోమవారం పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్ రఫత్ సుల్తాన, పంచాయతీ కార్యదర్శి పద్మ, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- వినాయకుని పూజలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

వినాయకుని ఆశీస్సులు ప్రజలపై ఉండి సుఖ సంతోషాలతో ఉండాలని వంగ రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ మాచాపూర్ పెద్ద లింగిరెడ్డిపల్లి తోర్నాల గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకు మండపాల వద్ద పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్న పెద్ద అందరూ కలిసి పాల్గొని నిర్వహించుకునే వినాయకుని పండుగ అని అన్నారు. నవరాత్రులు భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని ఆ విఘ్నేశ్వరుడిని ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని అన్నారు. విఘ్నేశ్వరుని మండపాల వద్ద కరెంటు తీగలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని అదేవిధంగా వినాయక నిమజ్జనం ఊరేగింపులోర మీరందరూ కూడా జాగ్రత్త వహించి చెరువులు కుంటలు నిండి ఉన్నాయి చిన్నపిల్లలను తీసుకపోరాదని అన్నారు. గ్రామానికి ఆహ్వానించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వ సాయం

నవతెలంగాణ-న్యాల్‌కల్ : చౌటకూరు వాగు వరద ఉధృతితో కల్వర్టులో కొట్టుకుపోయి అమీరాబాద్ గ్రామానికి చెందిన రవీందర్ అనే యువకుడు మృతి చెందిన విషయం విధితమే. మృతుని కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో అందజేసి ఆదుకున్నది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్, మాజీమంత్రి చంద్రశేఖర్, ఎంపీ సురేష్ షెట్కార్ సహకా రంతో ప్రభుత్వం నుంచి ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియో మంజూరవగా.. అందుకు సంబంధించిన చెక్కును సోమవారం రోజున మృతుని భార్యకు అందజేశారు. చెక్కు అందజేసిన వారిలో అందజేసినట్లు తాసిల్దార్ భూపాల్ ఆర్ఐ శ్యామ్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గ్రామ నాయకులు దత్తురెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.



గతంలో అవహేళనలకు గురైన యాస నేడు రాష్ట్ర భాష



నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ భాషకు శ్వాస వంటిది యాస. గతంలో నిరాదరణకు గురై, అవహేళన పాలైన యాస నేడు స్వరాష్ట్రంలో తనదైన అస్తిత్వాన్ని నిలుపుకొని గౌరవాన్ని పొందుతుందని, తెలంగాణ భాషకు ప్రత్యేక లక్షణంగా, ప్రత్యేక గుర్తింపు రావడానికి కారణం ఇక్కడి యాసనే ప్రధాన కారణమని వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయ ణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భాష కల్మషంలేని కష్టజీవుల ఉచ్వాస నిచ్వాసల నుంచి పురుడుబోసుకుని, పల్లె సేలకల మీద పరుగులు తీస్తుంది. తెలంగాణ యాసను ప్రపంచానికి పరిచయం చేసిన మహాకవి కాలోజీ నారాయణరావు. బడి పలుకుల భాష కాదు- పలుకుబడుల భాష కావాలని నినదించిన కవి కాళోజి. ఆయన జయంతి రోజును తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తుంది అన్నారు. తెలంగాణ ఉద్యమంలో అయన రాతలు విప్లవాన్ని సృష్టించాయి. కడవరకు తెలంగాణ స్పృహను ప్రజల్లో రగిలించిన కవి యోధుడు కాళోజి. ఆయన సేవలను స్మరించుకుంటూ వారికీ ఘన నివాళులు అర్పిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, సుధాకర్, కరుణాకర్, ఇంద్రసేనారెడ్డి, వరప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలి



నవతెలంగాణ-కోహెడ

చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్ హేమలత అన్నారు. సోమవారం మండలంలోని పోరెడ్డిపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అహగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. 0-5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీలో ఇచ్చే పాలు, గుడ్లు, పోషకాహారం, ఆకుకూరలు, పోషకాహారాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చారి, ఉపాధ్యాయురాలు కవిత, ఆశా కార్యకర్త రజిత, ఆయా, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అవాలతో కాళోజీ చిత్రాన్ని చిత్రించిన రామకోటి రామరాజు



నవతెలంగాణ- గజ్వేల్

ప్రజాకవి, పద్మవిభూషన్ కాళోజీ 110వ జయంతిని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు చిత్రాన్ని అవాలను ఉపయోగించి అత్యంత అద్భుతంగా చిత్రించి సోమవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ఘన నివాళులు అర్పించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షుల, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రజల మనిషి, తన కవిత్వంతో స్వరాష్ట్ర ఆకాంక్షలను రగిలించిన ప్రజాకవి కాళోజీ అన్నట్లు తెలిపారు. అక్షర రూపం దాల్చిన ఓ సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక అంటూ చైతన్యాన్ని చిక్కగా చెప్పిన ప్రజాకవి కాళోజీ అని అన్నారు. తెలుగు భాషా దినోత్సవ మూల కారకులు కాళోజి అని అన్నారు.

మృతుడి కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని మీనజీపేట్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో కర్రెని క్రిష్ణ, విద్యుత్ ప్రమాదంలో నీల యాదగిరి, ఇద్దరు యువకులు మరణించారు. వారి కుటుంబసభ్యులకు రూ.50వేల చొప్పున ఇద్దరి కుటుంబసభ్యులకు కలిపి రూ.లక్ష నగదును అందజేశారు. ఈ సందర్భంగా వేణుస్వామి మాట్లాడుతూ.. మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పించేలా భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నని అన్నారు. వారి వెంట గ్రామ నాయకులు, ఓఉన్నారు.

మృతిరాలు కుటుంబానికి డీసీసీబీ డైరెక్టర్ ఆర్థిక సహాయం

నవతెలంగాణ- ములుగు

ములుగు మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన బుడిగే రాజమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి సోమవారం ఉదయం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. వారితోపాటు బీఆర్ఎస్ నాయకులు మహదేవుని శ్రీనివాస్ గౌడ్, తూర్పుంటి లక్ష్మణ్, తోడేటి నరేందర్, తోడేటి రవి తో పాటు పాల్గొన్నారు.



ఘనంగా వినాయక నిమర్జనం





నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తిలో వ్యవసాయ క్షేత్రం ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి నివాసంలో ప్రతిష్టించిన వినాయకుని సోమవారం నిమర్జనాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ నిమర్జన వేడుకలో ప్రణతి రెడ్డి,భవిక్ రెడ్డి, అక్షిత్ రెడ్డి, మేకల కనకయ్య,అచ్చంగారి భాస్కర్,తదితరులున్నారు.

చౌటకూర్ ప్రజావాణిలో మూడు వినతులు



నవతెలంగాణ-చౌటకూర్

మండల తహసీల్దార్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు వినతులు వచ్చాయని ఇన్చార్జి తాహసిల్దార్ వంశీకృష్ణ తెలిపారు. చౌటకూరు గ్రామానికి చెందిన ఆవంచ రుక్కమ్మ అంతయోల్ల రంగయ్య ఇండ్లు వర్షానికి పాక్షికంగా దెబ్బతిన్నాయని.. అదేవిధంగా బద్రి గూడెం గ్రామానికి చెందిన బంటు లింగమ్మ ఇల్లు పూర్తిగా కూలిపోయిందని తమ కుటుంబాలకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించే విధంగా చూడాలని వినతులు వచ్చినట్లు ఇన్చార్జి తహసిల్దార్ తెలిపారు. వడ్ల శేఖర్ భూమికి సంబంధించిన సమస్య ఇంకా పరిష్కారం కాలేదని మరోసారి వినతిపత్రం అందించారు. వీటికి సంబంధించిన సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని వంశీకృష్ణ తెలిపారు.

గణనాథునికి ప్రవీణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో యువజన నాయకులు ప్రవీణ్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రవీణ్‌రెడ్డి భక్తులకు అన్నదానం వితరణ చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. గణనాథుని కృపాకటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సురేష్, కన్నయ్య, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.